

వెటర్నరీ వర్సిటీకి న్యాక్ గుర్తింపు

దేశంలోనే తొలి న్యాక్ పశువైద్య వర్సిటీగా గుర్తింపు

తిరుపతి(విద్య),ఫిబ్రవరి 23: తిరుపతి కేంద్రంగా నడిచే శ్రీవేంకటేశ్వర వెటర్నరీ వర్సిటీకి తొలిసారిగా న్యాక్ గుర్తింపు లభించింది. దేశంలోని పశువైద్య విశ్వవిద్యాలయాల్లో న్యాక్ గుర్తింపు కలిగిన వర్సిటీగా ప్రత్యేక గుర్తింపు సాధించింది. ఈనెల 13 నుంచి 15వ తేదీ వరకు మూడ్రోజుల పాటు చైర్మన్ డాక్టర్ సతీష్‌కుమార్ భండారీ నేతృత్వంలో ఆరుగురు సభ్యుల న్యాక్ పీర్ రివ్యూ టీం వర్సిటీలో పర్యటించి అనుబంధ కళాశాలలను తనిఖీ చేసి ఐదేళ్ల కాలానికి(2022-2027వరకు) న్యాక్ బీ ప్లస్ గ్రేడ్ గుర్తింపునిచ్చారు. ఇప్పటికే వర్సిటీకి 2027 మార్చి31 వరకు ఐదేళ్ల కాలానికి ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చరల్ రీసెర్చ్(ఐసీఏఆర్), వెటర్నరీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా(వీసీఐ) గుర్తింపుతో పాటు యూజీసీ 12బీ గుర్తింపు కూడా కలిగి ఉంది. కొత్తగా వర్సిటీ సిగలో న్యాక్ గుర్తింపు చేరడం పట్ల వర్సిటీ అధ్యాపక, ఉద్యోగ, విద్యార్థి వర్గాలు సంతోషం వ్యక్త పరుస్తున్నారు. న్యాక్‌కి సంబంధించి సెల్ఫ్‌స్టడీ రిపోర్ట్ చైర్మన్‌గా వర్సిటీ రీసెర్చ్ డైరెక్టర్ ప్రొఫెసర్ డాక్టర్ కె.సర్జన్‌రావు, కన్వీనర్‌గా ప్రస్తుత అసోసియేట్ డీన్ డాక్టర్ పి.జగపతిరామయ్య వ్యవహరించగా ఐక్యూ ఏసీ(ఇంటర్నల్ క్వాలిటీ అసెస్‌మెంట్ సెల్)ఇన్‌చార్జ్‌గా డీన్ ప్రొఫెసర్ డాక్టర్ కె.వీరబ్రహ్మయ్య వ్యవహరించారు. ఈ గుర్తింపు వల్ల వర్సిటీకి రీసెర్చ్ ప్రాజెక్ట్‌లతోపాటు యూజీసీ నుంచి నిధులు తెచ్చుకునే వెసులుబాటు ఉంటుందని అధికారవర్గాలు అంటున్నాయి. ఈ గుర్తింపుకు కృషి చేసిన ఏడీ జగపతి రామయ్య, ప్రొఫెసర్లు, అధ్యాపకులు, సిబ్బందిని రిజిస్ట్రార్ ప్రొఫెసర్ అరుణాచలం రవి, డీఆర్ ప్రొఫెసర్ డాక్టర్ కె.సర్జన్‌రావు, డీన్ ప్రొఫెసర్ కె.వీరబ్రహ్మయ్య అభినందించారు.



తుంబూరులో మాట్లాడుతున్న భువనేశ్వరి

అండగా ఉంటాం



తుంబూరులో టీడీపీ కార్యకర్త మునివేలు చిత్రపటానికి నివాళులర్పించిన భువనేశ్వరి, అతడి తల్లిదండ్రులను పరామర్శించారు. ఎల్లవేళలా పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఎమ్మెల్సీ పంచుమర్తి అనురాధ, మాజీ ఎంపీ పనబాక లక్ష్మి, మాజీ ఎమ్మెల్యే హేమలత, టీడీపీ చిత్తూరు, తిరుపతి పార్లమెంటు అధ్యక్షులు పులివర్తి నాని, నరసింహ యాదవ్, డాక్టర్ హెలెన్, జేడీ మౌనిక తదితరులు పాల్గొన్నారు.

- నారాయణవనం

పిల్లల చదువు బాధ్యత మాదే



చిత్తూరు రూరల్ మండలం ముత్తుకూరులోని మోహన్‌నాయుడు ఇద్దరి పిల్లల చదువు బాధ్యతను భువనేశ్వరి తీసుకున్నారు. ఎప్పుడు ఏ సమస్య వచ్చినా అండగా ఉంటానని కుటుంబీకులకు ధైర్యం చెప్పారు. మాజీ మంత్రి అమరనాథరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, పులివర్తి నాని, చంద్రప్రకాష్, కటారి హేమలత, జిల్లా కార్యదర్శి జయచంద్ర నాయుడు తదితరులు పాల్గొన్నారు.

- చిత్తూరు రూరల్

అధైర్యపడొద్దు



శ్రీరంగరాజపురం మండలం గంగమ్మగుడి గ్రామంలోని కరణం ఆంజనేయులునాయుడు(68) కుటుంబాన్ని నారా భువనేశ్వరి పరామర్శించారు. అధైర్యపడొద్దంటూ.. అండగా ఉంటామంటూ మృతుడి భార్య, ఇద్దరు కుమారులకు ధైర్యం చెప్పారు. కేంద్ర మాజీ మంత్రి పనబాక లక్ష్మి, నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ వీఎం థామస్, పరిశీలకుడు రవిప్రకాశ్, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి భీమనేని చిట్టిబాబు, నగరి ఇన్‌చార్జి గాలి భానుప్రకాశ్, తెలుగు మహిళ జిల్లా అధ్యక్షురాలు అరుణ, నాయకులు పాల్గొన్నారు.

- శ్రీరంగరాజపురం

ఈ ఎన్నికల్లో అభివృద్ధిని గెలిపించండి



సారె సామగ్రి తీసుకొస్తున్న కుటుంబ సభ్యులతో ఎమ్మెల్యే ఆదిమూలం

వైసీపీ అరాచకాన్ని తిప్పికొట్టండి

ప్రజలకు భువనేశ్వరి పిలుపు

చివరి రోజు ముగ్గురికి పరామర్శ

నారాయణవనం/సత్యవేడు/చిత్తూరు రూరల్, ఫిబ్రవరి 23: 'చంద్రబాబు పాలనలో రాష్ట్రం అభివృద్ధిలో ఏ విధంగా పరుగులు పెట్టిందో మనమంతా చూశాం. ఈ ఐదేళ్లలో ఎలాంటి అరాచకాలు జరుగుతున్నాయో కూడా మనం చూస్తున్నాం. రాష్ట్రంలో ప్రతి ఒక్కరిపైన దాడులు జరుగుతున్నాయి. చంద్రబాబునాయుడుపైనా అక్రమ కేసులు పెట్టి హింసిస్తున్నారు. రానున్న ఎన్నికలు అరాచకానికి.. అభివృద్ధికి మధ్య జరిగేవి. ప్రజలందరూ టీడీపీ వైపు నిలబడి అభివృద్ధిని గెలిపించాలి' అని నారా భువనేశ్వరి పిలుపునిచ్చారు. 'నిజం గెలవాలి' కార్యక్రమంలో భాగంగా నాలుగో రోజైన శుక్రవారం ఆమె చిత్తూరు రూరల్ మండలం ముత్తుకూరులో మోహన్‌నాయుడు.. శ్రీరంగరాజపురం మండలం గంగమ్మ గుడి గ్రామంలో కరణం ఆంజనేయులు నాయుడు.. తిరుపతి జిల్లా నారాయణవనం మండలం తుంబూరులో మునివేలు కుటుంబాలను పరామర్శించారు. ఒక్కో కుటుంబానికి రూ.3 లక్షల చొప్పున చెక్కులు అందించారు. తుంబూరు, ముత్తుకూరులో ఆమె మాట్లాడారు. ఈ ఎన్నికల్లో ఎలాగైనా గెలవాలని వైసీపీ కుట్రలు పన్నుతోందన్నారు. అందులో భాగంగా ప్రజలను భయపెట్టి ఇళ్లకు పరిమితం చేసి రిగ్గింగ్ చేసుకోవాలని చూస్తోందన్నారు. వీటిని అందరూ తిప్పి కొట్టాలని ఆమె కోరారు. చంద్రబాబును అక్రమంగా జైలు పెట్టినప్పుడు మహిళలు ముందుకొచ్చి అండగా నిలిచారన్నారు. ఇంటిపట్టునే ఉండే మహిళలూ బయటకు పోరాడారని గుర్తుచేశారు. టీడీపీ పాలనలో మహిళలకు రక్షణ ఉండేదని.. ఇప్పుడా పరిస్థితి ఉందా అని అడగారు. 'లేదు.. లేదు' అంటూ మహిళలు సమాధానం చెప్పారు. రాష్ట్రంలో యువతకు గంజాయి అలవాటు చేసిందని ఈ ప్రభుత్వమని ఆమె విమర్శించారు. ఆ మత్తులో మహిళలపై అఘాయిత్యాలు చేస్తున్నారని తెలిపారు. మహిళల కోసం చంద్రబాబు ఎన్నో పథకాలను ప్రవేశపెట్టారని.. ఇప్పుడు అధికారంలోకి వస్తే ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తారని వివరించారు. సూపర్ సిక్స్ పథకాల గురించి ఆమె ప్రస్తావించారు. 'నేనిలా ముందుకు వచ్చానంటే.. ఈ ధైర్యం మీరిచ్చిందే' అంటూ కార్యకర్తలను ఉత్సాహపరిచారు. కాగా, పుత్తూరు బైపాస్ రోడ్డులో సత్యవేడు వైసీపీ తిరుగుబాటు ఎమ్మెల్యే ఆదిమూలం, ఆయన కుమారుడు, జడ్పీటీసీ సుమన్‌కుమార్, కుటుంబ సభ్యులతో కలిసి భువనేశ్వరికి పసుపు, కుంకుమ, చీరను సారెగా అందించారు.

నేనున్నానని భరోసానిస్తూ..

● ముగిసిన భువనేశ్వరి పర్యటన ● 15 కుటుంబాలకు పరామర్శ

చిత్తూరు, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): చంద్రబాబు అరెస్టుతో మనస్తాపంతో మృతి చెందినవారి కుటుంబ సభ్యులను నారా భువనేశ్వరి ఓదార్చారు. తానున్నానంటూ భరోసానిచ్చారు. ఆమె నాలుగు రోజుల పర్యటన శుక్రవారం ముగిసింది. సాయంత్రం ఆమె రేణిగుంట ఎయిర్‌పోర్టు నుంచి హైదరాబాద్‌కు బయలుదేరి వెళ్లారు. ఈ నాలుగు రోజుల్లో చిత్తూరు జిల్లాలోని కుప్పం, పలమనేరు, పుంగనూరు, పూతలపట్టు, చిత్తూరు, జీడీనెల్లూరు నియోజకవర్గాల్లో 14 కుటుంబాలు, తిరుపతి జిల్లా సత్యవేడు నియోజకవర్గంలో ఒక కుటుంబాన్ని ఆమె పరామర్శించారు. ఒక్కో కుటుంబానికి రూ.3 లక్షల చొప్పున ఆర్థికసాయం అందించారు. బాధిత కుటుంబాలు భువనేశ్వరిని చూసి కన్నీరు మున్నీరు పెట్టుకోగా.. ఆమె ఓదార్చారు. బంగారుపాళ్యం మండలం టేకుమందలో వైసీపీ దాడిలో రెండు కళ్లను కోల్పోయిన హంసవేణిని పరామర్శించి, దివ్యాంగుడైన ఆమె కుమారుడి చదువు బాధ్యతను తీసుకుంటానని హామీనిచ్చారు. అన్నిచోట్లా భువనేశ్వరిని చూసేందుకు, సంఘీభావం తెలిపేందుకు పెద్దఎత్తున పార్టీ కార్యకర్తలు, మహిళలు, స్థానికులు తరలివచ్చారు. ఆయా ప్రాంతాల్లో ఆమెకు ఘనంగా స్వాగతం పలికారు. మార్గమధ్యంలో జనాన్ని చూసి కారు దిగి పలకరించారు. ఆమె పర్యటన ఆయా నియోజకవర్గాల్లో నాయకులు, కార్యకర్తలను ఉత్సాహ పరిచింది.

జనమేరి జహాపనా..?







● పట్టాలిచ్చినా...పత్తాలేరే..! ● 'కరుణ' కృతజ్ఞతా సభకు ఝలక్ ఇచ్చిన టీటీడీ ఉద్యోగులు

'ఐదు వేలమందికి పైగా ఇంటి పట్టాలిచ్చాం, రెండువేలమంది ఆటవీకార్మికులకు వేతనాలు పెంచాం. ఉద్యోగులు అడిగినవన్నీ తీర్చేస్తామన్న హామీలు ఇచ్చాం' అనుకుని రాబోయే ఎన్నికల్లో టీటీడీ ఉద్యోగుల ఓట్లు గంపగుత్తగా మన ఖాతాలోనే పడిపోతాయని లెక్కలు వేసుకున్నారు. పలు దశల్లో జరిగిన పట్టాల పంపిణీ కార్యక్రమాల్లో టీటీడీ చైర్మన్‌గా ఉన్న ఎమ్మెల్యే భూమన కరుణాకర రెడ్డిని పలువురు ఉద్యోగ సంఘ నాయకులు 'అహో.. రాజ, ఒహో భోజ' అన్నట్టు కీర్తించారు. అయితే టీటీడీ ఉద్యోగులంతా మనవైపే ఉన్నారనుకున్న ధీమా శుక్రవారం టీటీడీ పరిపాలన భవనం వెనుక పెరేడ్ గ్రౌండ్‌లో ఏర్పాటుచేసిన భూమన ఆత్మీయ సన్మాన కార్యక్రమం జరిగిన తీరుతో వైసీపీ నేతల్లో ఒక్కసారిగా సన్నగిల్లిపోయింది.కరుణాకర రెడ్డికి ఉద్యోగులే ఏర్పాటు చేసిన ఈ కృతజ్ఞతాభినందన సభ వెలవెలబోయింది. కార్యక్రమం సాయంత్రం 4.30 గంటలకు జరుగుతుందని చెప్పి, మీడియాకు కవరేజీ కోసం కబురు పెట్టారు. ఉదయం నుంచి వేదిక ఏర్పాట్లు చేశారు. సీఎం సభ తరహాలో పెద్దఎత్తున గ్యాలరీలు ఏర్పాటు చేశారు. సాయంత్రం అయిదున్నర దాకా ఉద్యోగులు ఆశించిన సంఖ్యలో రానేలేదు.సభా ప్రాంగణాన్ని నింపేందుకు ఉద్యోగ సంఘ నాయకులు నానా తంటాలు పడినప్పటికీ ఫలితం లేకుండా పోయింది.ఆరు వరుసల గ్యాలరీలను ఏర్పాటు చేస్తే, రెండు వరుసల గ్యాలరీకే ఉద్యోగులు పరిమితమయ్యారు. అందులో కూడా అటవీ కార్మికులు, అవుట్ సోర్సింగ్ సిబ్బందే ఎక్కువగా కనిపించారు. కుర్చీలన్నీ ఖాళీగా కనిపిస్తే బాగుండదని, వేసిన కుర్చీలను మడతపెట్టి పడుకోబెట్టేశారు. సాయంత్రం 6 గంటల ప్రాంతంలో కరుణాకర రెడ్డి వేదికవద్దకు చేరుకున్నారు.కార్యక్రమం యథాప్రకారం పొగడ్తలతో సాగింది.ప్లాట్లు ఇచ్చినా ఎందుకు రాలేదనే చర్చ గ్యాలరీల్లో సాగింది.దాదాపు రూ.9లక్షలు వెచ్చించి ఎక్కడో సుదూరంగా ప్లాట్లు తీసుకోవడం వలన పెద్దగా ఒరిగేదేమీలేదన్న అభిప్రాయం ఉద్యోగుల్లో ఉన్నట్టు చెప్పుకుంటున్నారు. ఈ అసంతృప్తితోనే ఉద్యోగులు అనాసక్తంగా ఉన్నట్టు తెలుస్తోంది.

- తిరుపతి,ఆంధ్రజ్యోతి

వెబ్‌సైట్‌లో ఇంటర్ హాల్‌టికెట్లు

తిరుపతి(విద్య), ఫిబ్రవరి 23: ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల హాల్ టికెట్లు బోర్డు వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయని ఆర్ఐవో జీవీ ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. జిల్లాలోని అన్ని యాజమాన్యాల పరిధిలోని కళాశాలల్లో ప్రథమ, ద్వితీయ సంవత్సర కోర్సుల విద్యార్థులు బీఐఈఏపీ.ఏపీసీఎఫ్ఎస్ఎస్.ఇన్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చని సూచించారు. ప్రత్యేకించి హాల్‌టికెట్లపై ప్రిన్సిపాల్ సంతకం అవసరం లేదని పేర్కొన్నారు.

నేడు ఇంటర్ పరీక్షలపై సమావేశం : టీటీడీ ఆధ్వర్యంలో నడిచే ఎస్వీ జూనియర్ కళాశాలలో శనివారం ఉదయం 10 గంటలకు ఇంటర్ పబ్లిక్ పరీక్షలపై సమావేశం ఉంటుందని, సీఎస్‌లు, డీవోలు, అడిషనల్ సీఎస్‌లు, కస్టోడియన్లు తప్పక హాజరు కావాలని ఆర్ఐవో కోరారు. జిల్లాలో 87 కేంద్రాల్లో వచ్చేనెల 1 నుంచి నిర్వహించే ఈ పరీక్షలకు సంబంధించిన పలు విషయాలపై అవగాహన కల్పిస్తామని తెలిపారు.

అన్నార్తులే మోతగాళ్లు...?

● అన్నదాన కేంద్రంలో పనిచేయని లిఫ్టు ● భక్తుల చేతే మోయించిన వేడి పాత్రలు

● నిద్రావస్థలో ముక్కంటి ఆలయ ఇంజనీరింగ్ వ్యవస్థ



వంటశాల నుంచి భోజన పాత్రలను మోసుకెళ్తున్న భక్తులు



శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 23 : శ్రీకాళహస్తీశ్వరాలయంలో అన్నార్తులైన భక్తులే మోతగాళ్లుగా మారారు.ఆలయంలోని నిత్యాన్నదాన మండపంలో భోంచేయడం ఈశ్వర ప్రసాదాన్ని స్వీకరించడంగా భక్తులు భావిస్తుంటారు.ఇక్కడ రోజుకు సుమారు 5000మంది భక్తులకు అన్న ప్రసాదం సరఫరా చేసేలా ఏర్పాటు చేశారు. కింద సెల్లార్ లోని వంటశాలలో వంటకాలను సిద్ధం చేస్తారు.వంట గదిలో నుంచి వాటిని మొదటి అంతస్తుకు లిఫ్ట్ ద్వారా తరలించాలి. సుమారుగా 200 సార్లు వేడివేడి వంటకాలను పాత్రలతో పైకి చేర్చాలి. అలాగే ఖాళీ అయిన పాత్రలను కిందకు తరలించుకోవాలి. అసలే అన్నదాన సత్రంలో సిబ్బంది కొరత ఉంది. దానికి తోడు మూడు నెలల నుంచి లిఫ్టు తరచూ మొరాయిస్తూనే ఉంది. వారం రోజుల నుంచి గోడల నుంచి లీకేజీల సమస్యతో లిఫ్ట్ పూర్తిగా పనిచేయడంలేదు.అప్పటినుంచి అన్నదాన సిబ్బందిపై వేడి పాత్రలు తరలించే అదనపు భారం పడింది. భక్తుల రద్దీ సమయంలో త్వరితగతిన పాత్రలను మొదటి అంతస్తుకు చేర్చాల్సి ఉంటుంది. దాంతో సిబ్బంది అన్నార్తులుగా వచ్చిన భక్తులనే సాయం పట్టండంటూ ప్రాధేయ పడాల్సి వస్తోంది. భారీ వేడి పాత్రలను భక్తుల సహాయంతో మొదటి అంతస్తుకు తీసుకెళుతున్నారు.

అదుపు తప్పితే ఎంత అప్రతిష్ట...?

వంట పాత్రలు బరువుతోపాటు వేడిగా కూడా ఉంటాయి. వాటిని భక్తులు మెట్ల మార్గంలో తీసుకెళ్లడం ప్రమాదకరంగా దర్శనమిస్తోంది.పాత్రలు అదుపుతప్పి పొరపాటున భక్తులపై పడితే శరీరం తీవ్రంగా గాయపడే ప్రమాదం వుంది. ఆలయంలో అన్న ప్రసాదం స్వీకరించేందుకు వచ్చిన భక్తులు ఎవరైనా ప్రమాదవశాత్తు గాయపడితే ఎంతటి అప్రతిష్టను మూట కట్టుకోవాల్సి వస్తుందో అర్థంకాని పరిస్థితి. ఆలయంలో పెద్ద ఎత్తున ఇంజనీరింగ్ వ్యవస్థ ఉంది. అయినా చిన్న లిఫ్ట్ సమస్యను ఎవరూ పట్టించుకోకపోవడం విమర్శలకు దారితీస్తోంది. ఆదాయం చేకూరే పనుల్లో తప్ప ఇటువంటి వాటిపై ఇంజనీరింగ్ అధికారులు శ్రద్ధ చూపరని ఆలయ ఉద్యోగులే బాహాటంగా విమర్శిస్తున్నారు.

తిరుపతిలో పొల్యూషన్ కంట్రోలు బోర్డు జోనల్ కార్యాలయం

● బోర్డు ప్రతిపాదనను ఆమోదించిన ప్రభుత్వం

తిరుపతి, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): ఏపీ పొల్యూషన్ కంట్రోలు బోర్డు జోనల్ కార్యాలయం తిరుపతిలో ఏర్పాటు కానుంది. ఇప్పటి వరకూ ప్రాంతీయ కార్యాలయం మాత్రమే వున్న తిరుపతిలో జోనల్ కార్యాలయం ఏర్పాటుకు బోర్డు చేసిన ప్రతిపాదనను రాష్ట్రప్రభుత్వం ఆమోదించింది. ఇప్పటి వరకూ రాష్ట్రంలో విజయవాడ, విశాఖపట్టణం, కర్నూలు నగరాల్లో జోనల్ కార్యాలయాలున్నాయి. కర్నూలు జోనల్ కార్యాలయ పరిధిలో మొత్తం రాయలసీమ ప్రాంతం కవర్ అవుతోంది. కొత్త జిల్లాల ఏర్పాటుతో నెల్లూరు జిల్లా పరిధిలోని పరిశ్రమల్లో 65 శాతం పరిశ్రమలు తిరుపతి జిల్లా పరిధిలోకి చేరాయి. దానివల్ల అత్తివరం, మేనకూరు సెజ్‌లు కూడా తిరుపతి పరిధిలోకి వచ్చాయి. రెడ్ కేటగిరీకి చెందిన పరిశ్రమలు, నగరిలోని డైయింగ్ యూనిట్లు, ఫ్రూట్ క్యానింగ్ యూనిట్లు, శ్రీసిటీ సెజ్, డీటీజెడ్ తదితరాలన్నీ మునుపే తిరుపతి ప్రాంతీయ కార్యాలయం పరిధిలో వున్నాయి. కొత్తగా నెల్లూరు జిల్లా నుంచీ వచ్చి చేరిన పరిశ్రమల కారణంగా తిరుపతి జిల్లాలోకి 17 రకాల ప్రమాదకరమైన పరిశ్రమలన్నీ చేరినట్టయింది. వీటిని 450 కిలోమీటర్ల దూరాన వున్న కర్నూలు నుంచీ తరచూ రాకపోకలు సాగించి పర్యవేక్షించడం కష్టసాధ్యమని గుర్తించిన ఏపీ పొల్యూషన్ బోర్డు తిరుపతిలో కొత్తగా జోనల్ కార్యాలయం ఏర్పాటు చేయడమే ఉత్తమమని భావించింది. ఆ మేరకు బోర్డు పాలకమండలి సమావేశంలో ప్రతిపాదనను ఆమోదించి అనుమతి కోసం రాష్ట్ర ప్రభుత్వానికి పంపింది. కొత్తగా భవన నిర్మాణం వంటివేవీ అవసరం లేదని, ఇప్పటికే తిరుపతిలో ప్రాంతీయ కార్యాలయం కోసం 25 సెంట్ల స్థలంలో రెండు సెల్లార్లు, గ్రౌండ్ ఫ్లోర్ సహా ఐదంతస్తుల భవనం కొత్తగా నిర్మించినందున ఆ భవనంలోనే జోనల్ కార్యాలయం కూడా నిర్వహించుకునే వీలుందని ప్రభుత్వానికి నివేదించింది. దీంతో కొత్తగా పోస్టులేవీ మంజూరు చేయకుండా వున్న సిబ్బందితోనే సర్దుబాటు చేసుకోవాలని సూచిస్తూ తిరుపతి కేంద్రంగా జోనల్ కార్యాలయం ఏర్పాటుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. ఈ మేరకు ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో తిరుపతిలో త్వరలో జోనల్ కార్యాలయం ఏర్పాటు కానుంది.

రేషన్‌కార్డు అడిగితే దాడి చేసిన వలంటీరు



బాధితుడు షారుఖ్

చిట్టమూరు, ఫిబ్రవరి 23: తాను దరఖాస్తు చేసుకున్న రేషన్‌కార్డు ఏమైందని అడిగినందుకు వలంటీరు, అతడి సోదరులు విచక్షణారహితంగా దాడిచేసి గాయపరిచిన ఉదంతమిది. గాయపడ్డ ఆ వ్యక్తి పోలీసులను ఆశ్రయిస్తే అతడినే తప్పుబడుతూ భయపెట్టి సర్దుబాటు చేసి పంపిన ఈ ఘటన చిట్టమూరు మండలం తాడిమేడు గ్రామంలో చోటుచేసుకుంది. బాధితుడి కథనం మేరకు... తాడిమేడుకు చెందిన షారుఖ్ ఆరునెలల క్రితం రేషన్‌కార్డు కావాలని సుమత్ అనే వలంటీరును అడిగాడు. రేషన్‌కార్డు లాగిన్ ప్రభుత్వం ఇంకా వదలలేదని రేషన్‌కార్డు ఇచ్చే సమయంలో తానే దరఖాస్తు చేస్తానని వలంటీరు చెప్పాడు. గురువారం రాత్రి ఇదే విషయమై షారుఖ్ వలంటీరును అడిగాడు. తనకు సంబంధం లేదని సచివాలయం వద్ద వెళ్లి అడగమని వలంటీరు సుమత్ చెప్పాడు. ఈ విషయంపై ఇద్దరి మధ్య వాదనలు చోటుచేసుకున్నాయి. అదే సమయంలో వలంటీరుతో పాటు అతడి సోదరులు ముగ్గురు షారూఖ్‌పై దాడిచేశారు. దీంతో షారూఖ్ తలపై బలమైన గాయమైంది. రక్తగాయాలతో షారూఖ్ చిట్టమూరు పోలీసులను ఆశ్రయించారు. అయితే పోలీసులు బాధితుడిని భయపెట్టి ఇద్దరి మధ్య రాజీ కుదిర్చి పంపినట్లు బాధితుడు తెలిపాడు. ఎస్ఐ చిన్నబలరామయ్యను వివరణ కోరగా షారూఖ్‌దే తప్పని, అందుకే సర్దుబాటు చేసి పంపినట్లు ఎస్ఐ తెలిపారు.

మురిక్కాలువ సమస్య పరిష్కారం

- సుధాయాదవ్‌కు వెంకటంపేటవాసుల సన్మానం
- వాగ్వాదానికి దిగిన వైసీపీ నాయకులు


బడి సుధాయాదవ్‌ను సన్మానిస్తున్న వెంకటంపేట గ్రామస్థులు

చంద్రగిరి,ఫిబ్రవరి 23: చంద్రగిరి మండలం రాయలపురం పంచాయతీ వెంకటంపేటలో ఏళ్ళ తరబడి ఉన్న మురిక్కాలువ సమస్యకు పరిష్కారం లభించింది. గురువారం కాలువ నిర్మాణానికి ఎమ్మెల్యే తనయుడు చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి భూమి పూజ చేశారు. దీంతో మురిక్కాలువ సమస్యకు పరిష్కారం లభించిందని ఓబీసీ ఫోరం రాష్ట్ర కన్వీనర్ బడి సుధాయాదవ్‌కు ఆ గ్రామస్తులు శుక్రవారం సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.మురిక్కాలువ సమస్యపై సుధా యాదవ్ పోరాటం చేయడంవలనే సమస్యకు పరిష్కారం లభించిందని గ్రామస్తులు ప్రసంగిస్తుండగా, అక్కడికి చేరుకున్న సర్పంచ్ వెంకటయ్య, వైసీపీ నాయకులు ఆనందయ్య, నాగార్జున సన్మాన సభను అడ్డుకునే ప్రయత్నం చేశారు. ఏళ్ళ తరబడి అధికారులకు, ప్రజాప్రతినిధులకు అర్జీలు ఇచ్చినా స్పందించలేదని, బడి సుధాయాదవ్ చొరవతో కాలువ నిర్మాణానికి భూమి పూజ చేశారు కదా అని గ్రామస్తులు నిలదీశారు. ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర రెడ్డి గ్రామాన్ని ఏమి అభివృద్ధి చేశాడో చెప్పాలన్నారు.ఎమ్మెల్యే పెళ్ళి కానుకలు, చీరలు, స్వీట్లు ఇస్తున్నాడు కదా అని వైసీపీ నాయకులు అనడంతో కొద్దిసేపు వాగ్వాదం నడిచింది. అంతలో ఎస్ఐ అనిత, సిబ్బంది వచ్చి సన్మాన సభ నుంచి వైసీపీ నాయకులను పక్కకు తీసుకెళ్ళడంతో వివాదం సద్దుమణిగింది. అనంతరం గ్రామస్తులు బడి సుధాయావ్‌ను ఘనంగా సన్మానించారు.

రైలు కిందపడి లెక్చరర్ ఆత్మహత్య


మృతదేహాన్ని తీసుకొస్తున్న రైల్వే పోలీసులు

చంద్రగిరి, ఫిబ్రవరి 23: శ్రీనివాసమంగాపురం సమీపంలోని ఓ ప్రైవేటు కళాశాలలో లెక్చరర్‌గా పనిచేస్తున్న సంతోష్ శ్రీరామ్(28) గురువారం సాయంత్రం రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. పాకాల రైల్వే పోలీసుల కథనం మేరకు... వెదురుకుప్పం మండలం పాతగుంట పంచాయతీ బలిజపల్లి కాలనీకి చెందిన చంద్రయ్య కుమారుడు సంతోష్‌శ్రీరామ్ తిరుపతిలోని ఎంకే నాయుడు కాలనీలో ఉంటూ నారాయణ కళాశాలలో ఫిజిక్స్ లెక్చరర్‌గా పనిచేస్తున్నాడు. గురువారం ఇంట్లో ఆర్థిక లావాదేవీల కారణంగా సంతోష్‌శ్రీరామ్ బయటకు వచ్చేశాడు. రాత్రి 7గంటల సమయంలో శ్రీనివాసమంగాపురం సమీపంలో కాట్పాడి ప్యాసింజర్ రైలు కింద పడి ఆత్మహత్య చేసున్నాడు. రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించి, కేసు నమోదు చేశారు. శుక్రవారం ఎస్వీ మెడికల్ కళాశాలలో పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు.

ఆటో స్టాండ్ ప్రారంభం



చంద్రగిరి, ఫిబ్రవరి23: చంద్రగిరి మండలం దోర్నకంబాల పంచాయతీలోని మల్లయ్యపల్లె సమీపంలో ధనేశ్వరమ్మ ఆలయం వద్ద ఆటో స్టాండ్‌ను శుక్రవారం ప్రారంభించారు.చంద్రగిరి-అనుప్పల్లి మార్గంలో ధనేశ్వమ్మ ఆలయం వద్ద బ్లూలాండ్ వాటర్ పార్క్ వద్ద నూతనంగా ధనేశ్వరమ్మ ఆటో స్టాండ్‌ను ప్రారంభించారు. ఆటో స్టాండ్ అధ్యక్షుడిగా మండపం పల్లెకు చెందిన గురుమూర్తి యాదవ్, ఉపాధ్యక్షుడుగా లక్ష్మీపతి, కార్యదర్శిగా రవి, సభ్యులుగా మునిచంద్రరాయల్, త్యాగరాజులు, విజయ్‌కుమా రెడ్డి, గుణాయాదవ్‌లను ఆటో కార్మికులు ఏకగ్రీవకంగా ఎన్నుకున్నారు.

తొండవాడలో 'గడప గడపకు'

చంద్రగిరి, ఫిబ్రవరి 23: తొండవాడ పంచాయతీలో శుక్రవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎంపీపీ హేమేంద్రకుమార్ రెడ్డి, జడ్పీటీసీ యుగంధర్‌రెడ్డి, సింగిల్‌విండో ఛైర్మన్ మల్లం చంద్రమౌళిరెడ్డి, సర్పంచ్ దీపికారెడ్డి, వైస్ ఎంపీపీ నిరంజన్,చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి పాల్గొన్నారు.

27న మినీ జాబ్ మేళా

చంద్రగిరి, ఫిబ్రవరి 23: తిరుపతి బాలాజీ కాలనీలోని ఎస్వీసీసీ డిగ్రీ కళాశాలలో ఈనెల 27న మినీ జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు తిరుపతి జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి లోకనాథం, ఎస్వీసీసీ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ నాగరాజు సంయుక్త ప్రకటనలో తెలిపారు. ఈ జాబ్‌మేళాలో జస్ట్ డయల్, అపోలో ఫార్మసీ, డిక్సన్ టెక్నాలజీస్ ఇండియా , బీగ్ సీ మొబైల్స్, ముత్తూట్ గ్రూప్, ఇస్కాన్ సంస్థలు హాజరుకానున్నట్లు పేర్కొన్నారు. పదవ తరగతి, ఇంటర్మీడియట్, ఐటీఐ, డిప్లొమో, ఏదైనా డిగ్రీలో ఉత్తీర్ణత సాధించిన నిరుద్యోగులు జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 9177508279, 8074919939 నెంబర్లలో సంప్రదించాలన్నారు.

ప్రశ్నించే మీడియాపై దాడులు దారుణం : జనసేన


జనసేన నేతలతో జిల్లా కార్యదర్శి నజీర్

పాకాల, ఫిబ్రవరి 23: మీడియాపై వైసీపీ శ్రేణులు దాడులకు పాల్పడడం దారుణమని జనసేన జిల్లా కార్యదర్శి నజీర్ అన్నారు. దామలచెరువులో శుక్రవారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ సాక్షాత్తు ముఖ్యమంత్రి జగన్ పాల్గొన్న సిద్ధం సభలో ఆంధ్రజ్యోతి స్టాఫ్ ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై వైసీపీ శ్రేణులు దాడి చేస్తున్నా నిలువరించాల్సిన పోలీసులు చోద్యం చూడడం, దాడులకు పాల్పడుతున్న ఉన్మాదులను ప్రోత్సహిస్తున్న వైసీపీ నాయకుల తీరును ప్రజలు గమనిస్తున్నారన్నారు. ప్రశ్నిస్తున్న వారిపై తప్పుడు కేసులు బనాయించడం తగదన్నారు. ప్రజలు ఈ ఎన్నికలలో వైసీపీకి తగిన గుణపాఠం చెప్పడానికి సిద్ధంగా వున్నారని హెచ్చరించారు. ఈ సమావేశంలో జనసేన నాయకులు తలారి గురునాథ్, రహమతుల్లా, షాజహాన్, మస్తాన్ పాల్గొన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో కాలిపోయిన మీటర్లు

పాకాల, ఫిబ్రవరి 23: దామలచెరువు బజారువీధి పరిసరాలలో గురువారం అర్ధరాత్రి షార్ట్ సర్క్యూట్‌తో 20 విద్యుత్ మీటర్లకు పైగా బుగ్గిపాలయ్యాయి. ఇన్సులేటర్‌పై బల్లి పడడంతో ఏర్పడ్డ హీట్‌తో హైటెన్షన్ వైర్లు తెగి ఎల్‌టీ లైన్‌పై పడడంతో ఈ ప్రమాదం జరిగిందని ఏఈఈ జనార్ధన్ రావ్ తెలిపారు. శుక్రవారం ఉదయం మరమ్మతులు చేసి కాలిపోయిన మీటర్లను రీప్లేస్ చేసి విద్యుత్ సరఫరా చేశారు. ఈ ఘటనతో 12 గంటలకు పైగా విద్యుత్ సరఫరా లేక వినియోగదారులు అవస్థలు పడ్డారు.

తండ్రీకూతుళ్లపై దాడి: కేసు నమోదు


గాయపడిన బసవయ్య

ఎర్రావారిపాలెం, ఫిబ్రవరి 23 : దారి విషయమై సమీప బంధువులు తండ్రి, కుమార్తెపై దాడి చేసిన ఘటనపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. ఎర్రావారిపాలెం మండలం నెరబైలు పంచాయతీ బిజ్జేపల్లెకు చెందిన పూజారి చిన్నస్వామి, అతని కుమారుడు ప్రశాంత్ తమ సమీప బంధువులు బసవయ్య, అతని కుమార్తెపై దాడి చేసి గాయపరిచారు. బసవయ్యకు, చిన్నస్వామి మధ్య దారి విషయమై కొంతకాలంగా వివాదం జరుగుతోంది. ఈ క్రమంలో రెండు రోజుల కిందట చిన్నస్వామి, అతడి కొడుకు ప్రశాంత్ తమ సమీప బంధువైన బసవయ్య, అతడి కుమార్తెపై దాడి చేశారు. బసవయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

26న సీఎం జగన్ రాక

చిత్తూరు కలెక్టరేట్/రామకుప్పం, ఫిబ్రవరి 23: సీఎం జగన్మోహన్‌రెడ్డి కుప్పం నియోజకవర్గ పర్యటన ఖరారైంది. ఆయన ఈనెల 26న జిల్లాకు రానున్నారు. సోమవారం ఉదయం 9.45కు ఆయన రేణిగుంట విమానాశ్రయం నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరి రామకుప్పం మండలం రాజుపేట హెలిప్యాడ్‌కు 10.25కు చేరుకుంటారు. స్థానిక ప్రజాప్రతినిధులతో కాసేపు మాట్లాడాక.. 10.30 గంటలకు పూజాస్థలానికి చేరుకుంటారు. అక్కడ ఎగ్జిబిషన్ స్టాళ్లను సందర్శిస్తారు. హెచ్ఎన్ఎస్ఎస్ నీటిని విడుదల చేస్తూ శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తారు. 11.05కు హెలికాప్టర్‌లో బయలుదేరి శాంతిపురం మండలం గుండుశెట్టిపల్లెకు చేరుకుంటారు. బహిరంగ సభాస్థలం వద్ద ఫొటో ఎగ్జిబిషన్‌లో పాల్గొని కొత్త చెరువుల శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తారు. 11.45 నుంచి మధ్యాహ్నం 1.10 వరకు బహిరంగ సభలో పాల్గొంటారు. అనంతరం హెలిప్యాడ్ వద్ద నాయకులతో మాట్లాడి.. హెలికాప్టర్‌లో రేణిగుంట విమానాశ్రయానికి బయలుదేరతారు.

రేపు మెగా వైద్య శిబిరం

పాకాల, ఫిబ్రవరి 23: స్థానిక ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ఆవరణలో ఆదివారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు డాక్టర్ ఎం.రామ్మూర్తినాయుడు, డాక్టర్ మాలేపాటి వాసు తెలిపారు. అన్ని జబ్బులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేస్తామన్నారు. ఈ శిబిరంలో సిమ్స్ డైరెక్టర్ డాక్టర్ రవికుమార్, వైద్య బృందం, డాక్టర్ మాలేపాటి దుర్గ, డాక్టర్ పి.మోహన తదితరులు పాల్గొంటారన్నారు. పరిసర గ్రామాల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు కోరారు.

పకడ్బందీగా గ్రూప్-2 పరీక్షలు

- హాజరుకానున్న 27,894మంది అభ్యర్థులు
- 61 కేంద్రాల ఏర్పాటు
- సమాచారం కోసం 9000665565
- కలెక్టర్ లక్ష్మీశ


అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ లక్ష్మీశ

తిరుపతి(కలెక్టరేట్), ఫిబ్రవరి 23: జిల్లాలో ఆదివారం గ్రూప్-2 పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ అధికారులను ఆదేశించారు. పరీక్షల ఏర్పాట్లపై శుక్రవారం ఆయన కలెక్టరేట్‌లో సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఉదయం 10.30 నుంచి మధ్యాహం ఒంటి గంట వరకు తిరుపతి, రేణిగుంట, శ్రీకాళహస్తి, పుత్తూరు, కోట, గూడూరు కేంద్రాలుగా పరీక్షలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. 61 సెంటర్లలో 27,894 మంది పరీక్షలకు హాజరుకానున్నారని తెలిపారు. ఇందు కోసం 31మంది జిల్లా అధికారులను రూట్ ఆఫీసర్లుగా, 61మంది తహసీల్దార్లు, ఎంపీడీవోలను లైజన్ ఆఫీసర్లుగా, 61మంది చీఫ్ సూపరింటెండెంట్లుగా నియమించినట్లు వివరించారు. ఉదయం 9.30 గంటలకల్లా అభ్యర్థులు వారికి కేటాయించిన పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు. హాల్ టిక్కెట్‌తో పాటు ఏదైనా గుర్తింపుకార్డు తీసుకురావాలన్నారు. సెల్‌ఫోన్స్, ఎలక్ట్రానిక్ వస్తువులకు అనుమతి లేదన్నారు. పరీక్ష సమయంలో విద్యుత్‌కు అంతరాయం లేకుండా చూడాలని, కేంద్రాల వద్ద తాగునీరు, ఓఆర్ఎస్, మెడికల్ కిట్‌లతో పాటు ఒక ఏఎన్ఎంను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అభ్యర్థులు సమాచారం కోసం 9000665565ను సంప్రదించాలని సూచించారు. ఈ సమావేశంలో డీఆర్వో పెంచలకిషోర్, గ్రూప్-2 పరీక్షల విభాగం అడిషనల్ సెక్రటరీ వెంకటలక్ష్మి, రూట్ ఆఫీసర్లు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, లైజన్ ఆఫీసర్లు, చీఫ్ సూపరింటెండెంట్లు పాల్గొన్నారు.

కుమారధార తీర్థ ముక్కోటికి ఏర్పాట్లు పూర్తి

- నేటి మధ్యాహ్నం 12 గంటల వరకే భక్తులకు అనుమతి

తిరుమల, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి) : తిరుమలలో శనివారం నిర్వహించనున్న కుమారధార తీర్థ ముక్కోటికి టీటీడీ ఏర్పాట్లు పూర్తిచేసింది. ఉదయ 5.30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు మాత్రమే భక్తులను అనుమతించనున్నారు. అధిక బరువు, ఆస్తమా, గుండె సంబంధిత సమస్యలు, ఇతర దీర్ఘకాలిక వ్యాధులున్న వారు, చిన్నపిల్లలు, వృద్ధులకు అనుమతి లేదని టీటీడీ స్పష్టం చేసింది. గోగర్భం నుంచి పాపవినాశనం వరకు ఆర్టీసీ బస్సుల్లో మాత్రమే భక్తులను అనుమతించనున్నారు. ట్రాఫిక్ దృష్ట్యా ప్రైవేట్ వాహనాల అనుమతిని రద్దు చేశారు. మార్గమధ్యంలో భద్రత, తాగునీరు, ఆహార పదార్థాలను అందుబాటులో ఉంచారు. అత్యవసర పరిస్థితుల్లో భక్తుల కోసం అంబులెన్స్‌లు, డాక్టర్లు, పారామెడికల్ సిబ్బంది, అవసరమైన మందులను అందుబాటులో ఉంచారు. శుక్రవారం తిరుమలలోని కమాండ్ కంట్రోల్ రూమ్‌లో భద్రతా ఏర్పాట్లపై తిరుమల ఏఎస్పీ శివరామరెడ్డి, వీజీవోలు నందకిశోర్, గిరిధర్, విజిలెన్స్, పోలీసు అధికారులు సమీక్షించారు.

అతివేగానికి ఇద్దరు విద్యార్థుల బలి


పునీత్ కుమార్, అమీన్ (ఫైల్ ఫొటోలు)

- ఆగి ఉన్న ఆర్టీసీ బస్సును బైక్‌తో వేగంగా ఢీకొట్టారు
- సంఘటనా స్థలంలో ఒకరు, ఆస్పత్రిలో మరొకరి మృతి


సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న సీఐ సుదర్శన్ ప్రసాద్

పూతలపట్టు, ఫిబ్రవరి 23: అతివేగానికి ఇద్దరు విద్యార్థులు బలయ్యారు. ఆగి ఉన్న ఆర్టీసీ బస్సును బైక్‌తో వేగంగా ఢీకొనడంతో సంఘటనా స్థలంలో ఒకరు, ఆస్పత్రిలో మరొకరు మృతి చెందారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. తిరుపతి పల్లెవీధికి చెందిన లేట్ మస్తాన్ కుమార్తె అమీన్ (19) నగరంలోని ఓ ప్రైవేటు కళాశాలలో బీకాం ద్వితీయ సంవత్సరం చదువుతోంది. ఈమె తల్లి కువైట్‌లో ఉంటూ బిడ్డను చదివిస్తోంది. తిరుపతి సమీపంలోని కొత్తపల్లికి చెందిన పెంచలయ్య కుమారుడు పునీత్‌కుమార్ (19) కూడా ఇదే కళాశాలలో బీసీఏ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. పునీత్ తండ్రి కూలిపనులు చేస్తూ చదివిస్తున్నాడు. ఈ ఇద్దరు విద్యార్థులు శుక్రవారం ద్విచక్ర వాహనంపై కాణిపాకానికి బయల్దేరారు. మార్గమధ్యంలో ఉదయం 11 గంటల సమయంలో పూతలపట్టు మండలంలోని పి.కొత్తకోట బస్టాపు వద్ద కుప్పం డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు నుంచి ప్రయాణికులు దిగుతున్నారు. ఆ సమయంలో వీరు వేగంగా వస్తూ బస్సును వెనుక నుంచి బైక్‌తో ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో అమీన్ అక్కడికక్కడే మృతిచెందగా, తీవ్రంగా గాయపడిన పునీత్ కుమార్‌ను 108 సిబ్బంది చికిత్స నిమిత్తం చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ అతను కూడా మృతి చెందాడు. సమాచారం అందుకున్న పూతలపట్టు సీఐ సుదర్శన్ ప్రసాద్ తమ సిబ్బందితో హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యల్లో పాల్గొన్నారు. ప్రమాదం విషయం తెలుసుకున్న బంధువులు, స్నేహితులు చిత్తూరు ప్రభుత్వాస్పత్రి వద్దకు చేరుకుని బోరున విలపించారు. మృతదేహాలకు శనివారం పంచనామా నిర్వహించనున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

గురురూప కీచకుడు

- ఉపాధ్యాయుడిపై దాడి.. అధికారుల విచారణ


ఎస్ఆర్ కండిగ జడ్పీ ఉన్నత పాఠశాలలో తల్లిదండ్రులతో మాట్లాడుతున్న ఎంఈవోలు

పాలసముద్రం, ఫిబ్రవరి 23: విద్యాబుద్ధులు నేర్పాల్సిన గురువు వక్రబుద్ధి చూపాడు. ఇతడి లైంగిక వేధింపులపై విద్యార్థినుల ఫిర్యాదుతో తల్లిదండ్రులు ఆగ్రహం చెందారు. అతడిపై దాడిచేసి నిర్బంధించారు. ఈ ఘటన శుక్రవారం పాలసముద్రం మండంలో చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. ఎస్ఆర్ కండ్రిగ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడు శంకర్ విద్యార్థినుల పట్ల వెకిలి చేష్టలు చేస్తుండటంతో వారు విసుగు చెందారు. ఇతడి తీరుపై తల్లిదండ్రులకు చెప్పారు. దీంతో విద్యార్థినుల తల్లిదండ్రులు, వారి బంధువులు కలిసి శుక్రవారం పాఠశాలకు వచ్చి తరగతి గదిలో ఉన్న శంకర్‌పై దాడిచేశారు. సహచర ఉపాధ్యాయులు గుమిగూడి జరిగిన సంఘటనపై ఆరాతీశారు. విద్యార్థినులపై అసభ్యంగా ప్రవర్తిస్తున్నాడంటూ చెప్పారు. ఇకపై ఇలాంటి తప్పు చేయనని, క్షమించాలంటూ ఉపాధ్యాయుడు విద్యార్థుల తల్లిదండ్రులను ప్రాధేయపడ్డాడు. ఈ వ్యవహారాన్ని డీఈవో చంద్రశేఖర్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఆయన ఆదేశాలతో గంగాధరనెల్లూరు ఎంఈవో గుణశేఖర్ రెడ్డి, పాలసముద్రం ఎంఈవో-2 గిరిజ పాఠశాలకు చేరుకుని ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడారు. విద్యార్థినులతోనూ విడివిడిగా సమావేశమయ్యారు. కాగా, చదువులో వెనుకబడి ఉన్న వారిని మందలించడంతో తనపై కక్షకట్టి అభాండాలు వేస్తున్నారని విచారణ అధికారుల ఎదుట ఉపాధ్యాయుడు శంకర్ వాంగ్మూలం ఇచ్చినట్లు తెలిసింది. ఏడాదిగా ఈ పాఠశాలలో ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయుల మధ్య ఆధిపత్యపోరు నడుస్తోంది. ఈ క్రమంలో ఉపాధ్యాయుడు శంకర్‌తోపాటు ప్రధానోపాధ్యాయుడు మనోహర్ నాయుడు తమ పాఠశాలకు అవసరం లేదని, బదిలీ చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు అధికారులకు తెలిపారు. ఈ ఘటనపై తమకు ఫిర్యాదు అందలేదని ఎస్ఐ ప్రసాద్ తెలిపారు.

వేదిక్‌వర్సిటీని సందర్శించిన భద్రేశదాసు



తిరుపతి(విద్య),ఫిబ్రవరి 23 : టీటీడీ ఆధ్వర్యంలో నడిచే ఎస్వీ వేదవర్సిటీని ఢిల్లీ అక్షరధామ్ స్వామినారాయణ సంస్థ ప్రధాన స్వామి భద్రేశదాసు శుక్రవారం సందర్శించారు. అధ్యాపకులు, విద్యార్థులతో నిర్వహించిన ముఖాముఖిలో భద్రేశదాసు మాట్లాడుతూ వేద విద్యార్థులందరూ వేదమంత్రాలను సుస్వరంగా అభ్యసించి ఉన్నతమైన ఉపాధి అవకాశాలను సాధించాలని ఆకాంక్షించారు. సాంకేతికతను దానిలో నిగూఢమై ఉన్న సైన్స్‌ని అధ్యయనం చేసి భారతదేశాన్ని విశ్వగురువు స్థానంలో నిలపాలన్నారు. వీసీ ప్రొఫెసర్ రాణీసదాశివ మూర్తి మాట్లాడుతూ భద్రేశదాసు రచించిన అక్షరపురుషోత్తమ దర్శన భాష్యాన్ని వివరించారు. రిజిస్ట్రార్ ప్రొఫెసర్ రాధాగోవిందత్రిపాఠి, అకడమిక్ డీన్ గోలి సుబ్రహ్మణ్యశర్మ, డాక్టర్ పురుషోత్తమాచార్యులు, డాక్టర్ ఉమేష్‌భట్, పీఆర్వో డాక్టర్ టి.బ్రహ్మాచార్యులు పాల్గొన్నారు.

జనరంజక పాలకుడు జన్నత్‌హుస్సేన్


1985లో నిరాహారదీక్ష శిబిరం వద్ద కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డికి నిమ్మరసం అందిస్తున్న కలెక్టర్ జన్నత్ హుస్సేన్

నెల్లూరు (సాంస్కృతికం), ఫిబ్రవరి 23 : కలెక్టర్‌గా జన్నత్‌హుస్సేన్ అందించిన సేవలను ఉమ్మడి నెల్లూరు జిల్లా ప్రజలు గుర్తు చేసుకుంటున్నారు.ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి స్పెషల్ చీఫ్ సెక్రటరీగా పనిచేసిన జన్నత్ హుస్సేన్ అనారోగ్యంతో శుక్రవారం తెల్లవారుజామున సూళ్లూరు పేటలోని స్వగృహంలో కన్నుమూసిన విషయం తెలిసి ఆయనకు అశ్రునివాళులర్పించారు.జన్నత్ హుస్సేన్ పార్థివ శరీరాన్ని హైదరాబాద్‌కు తరలించారు. ఆయన అంత్యక్రియలు పంజగుట్టలో శనివారం జరుగుతాయని కుటుంబీకులు తెలిపారు.కాగా 1985-87మధ్య నెల్లూరు జిల్లా కలెక్టర్‌గా విధులు నిర్వహించిన ఆయన హోదాను పక్కనపెట్టి తన వద్దకు ఎవరు వచ్చినా లేచి నిలబడి అర్జీలు తీసుకునేవారు.ఎప్పటి సమస్యను అప్పుడే పరిష్కరించేవారు.అధికారులను ఓ మిత్రుడిగా ప్రోత్సహించే వారు. నెల్లూరు నగరంలో ఎంతో మంది పేదలకు ఇళ్ల స్థలాలు అందజేశారు. జన్నత్ హుస్సేన్ నగర్, కిసాన్‌నగర్ ఆయన హయాంలోనే ఏర్పాటు చేశారు. పేదలకు గృహ నిర్మాణాలలో నెల్లూరు జిల్లాను ప్రథమ స్థానంలో నిలిపిన ఆయనకు ప్రభుత్వం అవార్డు, నగదు పురస్కారం అందజేయగా ఆ నగదును కూడా హౌసింగ్ శాఖ సిబ్బందికే పంచిపెట్టారు.కొత్తూరులో నిరుద్యోగులకు ఇచ్చిన కోళ్లఫారంలో కోళ్లు గంబోరా వ్యాధితో చనిపోయి తీవ్రంగా నష్టపోయారు. కలెక్టర్ హోదాలో జన్నత్ స్వయంగా కోళ్లఫారాలను సందర్శించి నిర్వాహకులకు ధైర్యం చెప్పారు. పేద విద్యార్థులు చదువుకునే సంక్షేమ హాస్టళ్లలో సమస్యలను స్వయంగా పరిశీలించడమేకాక విద్యార్థులకు దుస్తులు పంచేవారు. ఆయన బదిలీ అయినప్పుడు ఏ కలెక్టర్ చేయని విధంగా జిల్లాలోని 46 మండలాలకు వెళ్లి అక్కడి అధికారులను, సిబ్బందిని పలకరించి వీడ్కోలు తీసుకున్న సంఘటనలను పలువురు విశ్రాంత అధికారులు గుర్తు చేసుకుంటున్నారు.

ఎమ్మెల్యే కోటంరెడ్డి నివాళి

జన్నత్ హుస్సేన్ మరణంపై నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1985లో వీఆర్ కళాశాల విద్యార్థి సంఘం అధ్యక్షుడిగా 13రోజులు నిరాహార దీక్ష చేసినప్పుడు అప్పటి ముఖ్యమంత్రి ఎన్టీఆర్ ఆదేశాల మేరకు జన్నత్‌హుస్సేన్ కలెక్టర్ హోదాలో దీక్షా శిబిరం వద్దకు వచ్చారని గుర్తు చేసుకున్నారు. విద్యార్థుల సమస్యలు పరిష్కరించి, తనకు నిమ్మరసం ఇచ్చి దీక్షను విరమింపచేశారని తెలిపారు.అప్పట్లో డీసీసీబీకి జరిగిన ఎన్నికల్లో గుమస్తాగిరి నుంచి కలెక్టర్ వరకు అన్ని తానై సమర్థవంతంగా నిర్వహించి రైతుల మన్నలు పొందారన్నారు.

అటవీశాఖ సిబ్బందిపైకి దూసుకెళ్లిన కారు


చికిత్స పొందుతున్న కానిస్టేబుల్ ప్రభాకర రావు

- కానిస్టేబుల్‌కు, ఫారెస్టు వాచ్‌మాన్‌కు గాయాలు

ఏర్పేడు, ఫిబ్రవరి 23:వాహనాలు తనిఖీ చేస్తున్న అటవీశాఖ సిబ్బందిపై ఓ కారు దూసుకెళ్లడంతో ఇద్దరు గాయపడ్డారు.ఆర్ఎస్ఐ వినోద్‌కుమార్ ఈ ఘటనపై ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఏర్పేడు సీఐ శ్రీరామ శ్రీనివాసులు కేసు నమోదు చేశారు.ఎర్రచందనం తరలిపోతోందన్న సమాచారంతో తిరుపతి ఆర్ఎస్ఐ వినోద్‌కుమార్ తన సిబ్బందితో ఏర్పేడు మండలం చింతలపాళెం చెక్‌పోస్టు వద్ద శుక్రవారం తెల్లవారుజామున వాహనాలు తనిఖీ చేస్తున్నారు. టీఎస్ 09 ఈఎస్ 5767 నెంబరు గల కారు తనిఖీలకు సహకరించకుండా వేగంగా చింతలపాళెం టోల్‌ప్లాజా వైపు వెళ్లింది.తప్పించుకుపోయే క్రమంలో అక్కడ తనిఖీ చేస్తున్న మరో టీముపైకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో కానిస్టేబుల్ కేవీ ప్రభాకర రావుకు, ఫారెస్టు వాచ్‌మాన్ సుబ్రహ్మణ్యానికి గాయాలయ్యాయి.వీరిలో ప్రభాకర రావు కరకంబాడి సమీపంలోని అమర ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు.ఆయన తలకు బలమైన గాయం కావడంతో సర్జరీ చేసినట్లు సమాచారం.

ఆకట్టుకున్న ఆవిష్కరణలు

రేణిగుంట, ఫిబ్రవరి 23 : ఏపీ ఈఎండీపీ డిస్ట్రిక్ట్ లెవల్ ఎక్స్‌పో పేరిట నూతన ఆవిష్కరణల పోటీలు శుక్రవారం రేణిగుంట జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో ఘనంగా జరిగాయి. జిల్లాస్థాయిలో జరిగిన ఈ పోటీలకు 15 పాఠశాలల నుంచి విద్యార్థులు విచ్చేశారు. 166 ప్రాజెక్టులను రూపొందించి ప్రదర్శించారు. తడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు రూపొందించిన ఎకోబ్రిక్స్ తయారీ ప్రాజెక్టును రాష్ట్రస్థాయికి ఎంపిక చేసినట్లు డీఈవో శేఖర్ తెలిపారు. మొత్తం ఐదు ప్రాజెక్టులను రాష్ట్రస్థాయికి ఎంపిక చేశారు. విద్యాశాఖ అధికారులు ఇందిరాదేవి, రంగనాథయ్య, హెచ్ఎం విష్ణువర్ధనం, కరుణ తదితరులు పాల్గొన్నారు.

విజేతలకు ప్రశంసాపత్రాలను అందించిన డీఈవో వి.శేఖర్ తదితరులు





తిరుమలలో పట్టుబడిన కొండ చిలువ

తిరుమల, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): తిరుమలలో శుక్రవారం ఓ భారీ కొండ చిలువ పట్టుబడింది. సేవాసదన్ వెనుకభాగంలోని అడవి నుంచి సుమారు 12 అడుగుల పొడవు కలిగిన కొండచిలువ జనసంచారంలోకి వచ్చింది. వెంటనే పాములు పట్టే టీటీడీ కాంట్రాక్ట్ ఉద్యోగి భాస్కర్ నాయుడు ఘటనా ప్రాంతానికి చేరుకుని దాన్ని పట్టుకుని దట్టమైన అడవిలో విడిచిపెట్టారు.

ఎపికాన్ సదస్సులో డాక్టర్ కృష్ణ ప్రశాంతి



తిరుపతి, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి) : తిరుపతికి చెందిన ప్రముఖ ఫిజీషియన్, బైరాక్ (బయోటెక్నాలజీ ఇండస్ట్రీ రీసెర్చ్ అసిస్టెంట్ కౌన్సిల్) సభ్యురాలు డాక్టర్ పెన్నా కృష్ణ ప్రశాంతి శుక్రవారం ఢిల్లీలో జరిగిన 79వ జాతీయ ఫిజీషియన్ల (ఎపికాన్-24) సదస్సులో పాల్గొన్నారు. తీవ్ర అనారోగ్యంతో బాధపడుతూ మరణించే రోగుల సహాయకులకు కౌన్సెలింగ్ చేసే విధానాలు, ఆవశ్యకత, అవసరం గురించి ఆమె పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న రోగులు సంరక్షకులతో మాట్లాడటం వల్ల మానసిక క్షోభను తగ్గించడంలో, స్వీయరక్షణ కొనసాగించడంలో సహాయపడుతుందని అభిప్రాయపడ్డారు. ముఖ్యంగా వృద్ధులు, క్యాన్సర్ వ్యాధిగ్రస్తులు, చివరి దశల్లో ఉన్న వారి మరణం బాధాకరమన్నారు. మెడిసిన్ పుస్తకంలో ప్రచురణ పొందిన ఆమె పరిశోధన పత్రాన్ని ఉప రాష్ట్రపతి జగదీప్ ధంకర్ ఆవిష్కరించారు.

తిరుచ్చిపై అలమేలు మంగ అభయం

తిరుచానూరు, ఫిబ్రవరి 23: తిరుచానూరులో కొలువైన అలమేలుమంగ తాయారు బంగారు తిరుచ్చిపై కొలువుదీరి శుక్రవారం ఆలయమాడ వీధుల్లో ఊరేగుతూ భక్తులను అనుగ్రహించారు. వేకువజామున సుప్రభాత సేవతో అర్చకులు అమ్మవారిని మేల్కొలిపి నిత్య కైంకర్యాలు నిర్వహించారు. మూలమూర్తికి నేత్రపర్వంగా అభిషేకం నిర్వహించారు. ఉదయం కల్యాణోత్సవం, లక్ష్మీపూజ వేడుకగా జరిగింది. మధ్యాహ్నం అలమేలు మంగతాయారు ఉత్సవమూర్తిని ఫ్రైడే గార్డెన్‌కు వేంచేపు చేసి భక్తుల గోవిందనామస్మరణల మధ్య అర్చకులు తిరుమంజనం జరిపించారు. అలంకార శోభితురాలైన అమ్మవారు తిరుచ్చిపై కొలువుదీరి భక్తులకు అభయమిచ్చారు. తై మాసం పురస్కరించుకుని అమ్మవారి దర్శనానికి మహిళా భక్తులు పోటెత్తారు. అనంతరం పసుపుధారలను భక్తులకు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఈవో గోవిందరాజన్, సూపరింటెండెంట్ శ్రీవాణి, మధు, శేషగిరి, అర్చకులు బాబుస్వామి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, గణేష్, సుభాస్కర్‌నాయుడు, అశోక్ పాల్గొన్నారు.


తిరుచ్చిపై ఊరేగుతున్న పద్మావతి అమ్మవారు

తిరుపతి

పోలింగ్ కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు


మాట్లాడుతున్న కలెక్టర్ లక్ష్మీశ

తిరుపతి కలెక్టరేట్, ఫిబ్రవరి 23 : జిల్లాలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించామని కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. విజయవాడలోని ఎన్నికల ప్రధాన అధికారి కార్యాలయం నుంచి శుక్రవారం రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సమీక్షించారు. కలెక్టరేట్ నుంచి హాజరైన కలెక్టర్ మాట్లాడుతూ గతవారం 6, 7, 8 ఫాంలకు సంబంధించి 8,534క్లెయిమ్‌లను పరిష్కరించామన్నారు. మిగిలినవి ఈ వారంలో పరిష్కరిస్తామన్నారు. ఓట్ల లెక్కింపునకు సంబంధించి 15 హాల్స్‌ను పరిశీలిస్తున్నట్లు తెలిపారు. వివిధ దినపత్రికల్లో 164 ప్రతికూల వార్తలు వచ్చాయని, ఇందులో 66 పరిశీలించామని, మిగిలిన 98 ఈఆర్వోల దగ్గర పెండింగ్‌లో ఉన్నాయని వివరించారు. ఈ సమావేశంలో డీఆర్వో పెంచలకిషోర్, ఈఆర్వోలు కోదండరామిరెడ్డి, కిరణ్‌కుమార్, చంద్రముని, డిప్యూటీ కలెక్టర్లు మురళి, చంద్రశేఖర్‌నాయుడు పాల్గొన్నారు.

రాష్ట్రాన్ని తాలిబన్ రాజ్యంగా మార్చేస్తున్నారు


భాస్కర్‌కు నియామకపత్రం అందజేస్తున్న గోపి

తిరుపతి(తిలక్‌రోడ్), ఫిబ్రవరి 23 : సీఎం జగన్ రాష్ట్రాన్ని తాలిబన్ రాజ్యంగా మార్చేస్తున్నారని కాంగ్రెస్ పార్టీ నగర అధ్యక్షుడు యార్లపల్లి గోపి విమర్శించారు. శుక్రవారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ వైసీపీ పాలనలో రాష్ట్రంలో అన్ని వర్గాలు ప్రత్యక్షంగా, పరోక్షంగా దెబ్బతిన్నాయన్నారు. కాంగ్రెస్, టీడీపీ హయాంలో బీసీలకు క్యాబినెట్ హోదా పదవులతో పాటు నిధులు కేటాయిస్తే ప్రస్తుత పాలకులు 54 బీసీ కార్పొరేషన్లు ఏర్పాటు చేసి, కనీసం కుర్చీలు ఇవ్వకుండా బీసీలను దగా చేశారన్నారు. వైసీపీ బీసీ నేత జంగా కృష్ణమూర్తి సీఎం అపాయింట్‌మెంట్ కోసం ఆరు నెలలు వేచి చూడాల్సి వచ్చిందంటే ఆ సామాజిక వర్గం పట్ల వారికున్న చిత్తశుద్ధి ఏమిటో అర్థమవుతోందన్నారు. పెద్ద పదవులు వారి సామాజిక వర్గానికి ఇచ్చుకుని చిన్నచిన్న పదవులు బీసీలకు కేటాయించి చేతులు దులుపుకుంటున్నారని విమర్శించారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ ఓబీసీ నగర అధ్యక్షుడిగా భాస్కర్‌గౌడ్‌కు నియామకపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో శాంతియాదవ్, రవి, శోభ, జావీద్, రమేష్‌రెడ్డి, మున్వర్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

దేశ భవిష్యత్తు కోసం ఇండియా కూటమిని బలపరచండి : ఆప్


సమావేశంలో మాట్లాడుతున్న ఆమ్ ఆద్మీ పార్టీ నేతలు

తిరుపతి(తిలక్‌రోడ్), ఫిబ్రవరి 23: దేశ భవిష్యత్తు కోసం ఇండియా కూటమిని బలపరచాలని ఆమ్ ఆద్మీ పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఉపాధ్యక్షుడు బాలసుబ్రహ్మణ్యం, వెంకటాచలపతి విజ్ఞప్తి చేశారు. శుక్రవారం ప్రెస్‌క్లబ్‌లో వారు మాట్లాడుతూ బీజేపీతో కలవనందుకు అరవింద్ కేజ్రీవాల్‌ను సీబీఐ, ఈడీల ద్వారా ఇబ్బందులకు గురిచేస్తోందన్నారు. దేశంకోసం కేజ్రీవాల్ ప్రాణాలు సైతం అర్పించేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. ఆమ్ ఆద్మీ పార్టీ ఇండియా కూటమిలో భాగస్వామ్యం కావడాన్ని బీజేపీ జీర్ణించుకోలేకపోతోందన్నారు. రానున్న ఎన్నికల్లో ఇండియా కూటమితో కలిసి పోటీ చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐరాల లోకేష్, శేఖర్ భాస్కర్, విక్రమ్‌రెడ్డి పాల్గొన్నారు.

26న కల్యాణకట్ట క్షురకుల మహాధర్నా


మీడియాతో మాట్లాడుతున్న కందారపు మురళి

తిరుపతి(కొర్లగుంట), ఫిబ్రవరి 23: వేతనాలు పెంచాలని కల్యాణకట్ట క్షురకులు ఈనెల 26వ తేదీన టీటీడీ పరిపాలన భవనం ముందు మహాధర్నా చేపట్టనున్నట్లు సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి తెలిపారు. శుక్రవారం ఆయన యశోదనగర్‌లోని వేమన విజ్ఞాన కేంద్రంలో మీడియాతో మాట్లాడారు. 850మంది క్షురకులలో లక్ష్మీశ్రీనివాస కార్పొరేషన్ పరిధిలో ఉన్న 18మందికి మాత్రమే జీతాలు పెంచడం అన్యాయమన్నారు. మిగిలిన వారు కోర్టును ఆశ్రయించారనే కారణం చూపడం దారుణమన్నారు. వేతనాల పెంపు విషయంలో టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి మాట తప్పారని మండిపడ్డారు. కేవోడీ(కట్ ఆఫ్ డ్యూటీ) విధానాన్ని శాశ్వతంగా రద్దు చేయాలని, క్షురకుల ఆరోగ్య పరిరక్షణకు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఏపీ క్షౌరవృత్తిదారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మేళ్లచెరువు గంగులప్ప, శ్రీవారి కల్యాణకట్ట నాయీబ్రాహ్మణ సంక్షేమ సంఘం అధ్యక్షుడు శ్రీహరి, ప్రధాన కార్యదర్శి జి.ప్రసాద్ పాల్గొన్నారు.

ఆర్టీసీ ఎండీకి ఘన స్వాగతం



తిరుపతి(కొర్లగుంట), ఫిబ్రవరి 23: ఆర్టీసీ ఎండీ ద్వారక తిరుమలరావు శ్రీవారి దర్శనార్థం శుక్రవారం సాయంత్రం తిరుమల చేరుకున్నారు. పోలీసు గెస్ట్‌హౌస్ వద్ద ఆయనకు ప్రజారవాణాధికారి చెంగల్‌రెడ్డి ఘనంగా స్వాగతం పలికారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.95 కోట్లు

తిరుమల, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.3.95 కోట్లు లభించింది. బుధవారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ గురువారం లెక్కించి శుక్రవారం ఉదయం ప్రకటించింది. ఇక, గురువారం 57,973 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. 21,722 మంది తలనీలాలు సమర్పించారు.

వెంకన్న సేవలో ప్రముఖులు


భగవత్ కరద్ - చంద్రశేఖర్ - సునీత లక్ష్మారెడ్డి - ఎస్ఎస్ రావత్

తిరుమల, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని శుక్రవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో కేంద్రమంత్రి భగవత్ కరద్, ఏపీ ఫైనాన్స్ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎస్ఎస్ రావత్, ఎంపీ చంద్రశేఖర్, మాజీ మంత్రి సునీత లక్ష్మారెడ్డి ఉన్నారు. వీరికి ఆలయాధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి, లడ్డూప్రసాదాలు అందజేశారు.

టీటీడీ ఉద్యోగులు అడిగినవన్నీ చేశా : చైర్మన్



తిరుపతి(కొర్లగుంట), ఫిబ్రవరి 23: టీటీడీ ఉద్యోగులు అడిగినవన్నీ సకాలంలో చేయగలిగానన్న సంతృప్తి కలిగిందని టీటీడీ చైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి అన్నారు. టీటీడీ చైర్మన్ పదవి చాలా గొప్పదన్నారు. ఉద్యోగులందరికీ మంచి చేయాలన్నదే తన తపన అని, శ్రీవారు తనకు ఇచ్చిన ఈ అవకాశాన్ని కిందిస్థాయి సిబ్బందికి మేలు చేయడానికి వినియోగిస్తానని చెప్పారు. జేఈవో వీరబ్రహ్మం మాట్లాడుతూ చైర్మన్ ఆదేశాలతోనే ఉద్యోగులకు ఇళ్ల పట్టాల పంపిణీ కార్యక్రమం సజావుగా సాగిందన్నారు. టీటీడీ చైర్మన్‌ను టీటీడీ ఉద్యోగ సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి ఘనంగా సన్మానించారు. తొలుతగా గజమాల వేసి స్వాగతించారు. ఉద్యోగ సంఘాల నాయకులు మాట్లాడుతూ 'కరుణన్నా మీ సహాయం మరువలేం.. మా జీవితాల్లో వెలుగులు నింపారు.. సరైన సమయంలో రుణం తీర్చుకుంటాం' అని పేర్కొన్నారు. టీటీడీ ఉద్యోగులు, కాంట్రాక్ట్ సిబ్బంది, కార్పొరేషన్ కార్మికుల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తున్నారని కొనియాడారు. ఇళ్లస్థలాలు కేటాయించి సొంతింటి కల సాకారం చేశారని, ఉద్యోగుల అప్పీళ్లను పరిష్కరించారని, క్యాస్‌లెస్ విధానం ద్వారా మెరుగైన వైద్య సేవలు అందించే నూతన ఒరవడి శ్రీకారం చుట్టారని గుర్తు చేశారు. తిరుపతి ఆవిర్భావ చరిత్రను వెలికితీసి పుట్టిన రోజు వేడుకలు ఏటా నిర్వహిస్తుండడం గర్వకారణమన్నారు.

బీజేపీ ప్రజాపోరు ప్రారంభం

తిరుపతి(ఉపాధ్యాయనగర్), ఫిబ్రవరి 23: బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి పిలుపుమేరకు ఆ పార్టీ స్థానిక నాయకులు శుక్రవారం ప్రజాపోరు కార్యక్రమాన్ని ప్రారంభించారు. వైసీసీ ప్రభుత్వ వైఫల్యాలు, ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగడుతూ, కేంద్ర ప్రభుత్వ ప్రజా సంక్షేమ కార్యక్రమాలను ప్రజల వద్దకు తీసుకువెళ్లనున్నారు. తిరుపతి పార్లమెంటు నియోజకవర్గ కార్యాలయంలో ప్రజాపోరు కన్వీనర్ ఎస్.మునిసుబ్రహ్మణ్యం, రాష్ట్ర కార్యదర్శి, సాంస్కృతిక విభాగం కన్వీనర్ గుండాల గోపీనాథ్‌రెడ్డి, నాయకులు సుబ్రహ్మణ్యం యాదవ్, భానుప్రకాష్‌రెడ్డి, సామంచి శ్రీనివాస్, వరప్రసాద్, బండ మురళి, రవిప్రసాద్, డాక్టర్ శ్రీహరిరావు, మల్లకుప్పం శేఖర్, తొండమనాటి సుబ్రహ్మణ్యంరెడ్డి పాల్గొన్నారు.

ఎలాంటి ఆటంకాలు లేకుండా కుల సర్వే జరగాలని కోరా

తెలంగాణ బీసీ కమిషన్ చైర్మన్


కృష్ణమోహన్‌రావు

తిరుమల, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రభుత్వం త్వరలో చేపట్టబోయే కుల సర్వే (కుల గణన) ఎలాంటి ఆటంకాలు లేకుండా కొనసాగాలని శ్రీవారిని ప్రార్థించినట్టు తెలంగాణ బీసీ కమిషన్ చైర్మన్ వకుళాభరణం కృష్ణమోహన్‌రావు తెలిపారు. తిరుమల శ్రీవారిని శుక్రవారం దర్శించుకున్న ఆయన ఆలయం ముందు మీడియాతో మాట్లాడారు. ప్రధానంగా రాష్ట్రంలో బీసీలు చాలాకాలంగా తమ లెక్కలు తీసి, అందుకనుగుణంగా అన్ని రంగాల్లో సమాన ప్రయోజనాలు కల్పించాలని డిమాండ్ చేస్తున్నారన్నారు. త్వరితగతిన విధివిధానాలు ఖరారు చేసి, కుల సర్వే ఆరంభించాలని ప్రయత్నిస్తున్నామన్నారు.

శ్రీవారిని దర్శించుకున్న ఆర్టీసీ ఎండీ



తిరుమల, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): ఏపీఎస్ ఆర్టీసీ ఎండీ ద్వారక తిరుమలరావు శుక్రవారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. రాత్రి నైవేద్య విరామ సమయంలో ఆలయంలోకి వెళ్లిన ఆయన ముందుగా ధ్వజస్తంభానికి మొక్కుకుని తర్వాత గర్భాలయంలోని మూలమూర్తిని దర్శించుకున్నారు. ఆలయాధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి, ప్రసాదాలు అందజేశారు.

తిరుపతిలో భూ కబ్జాలపై ఎన్‌ఆర్‌ఐ వైద్యురాలి ఆవేదన

వైరల్‌గా మారిన వీడియో


బాధితురాలు సునీత

తిరుపతి, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి) : తిరుపతిలో వైసీపీ నేతల అండదండలతో భూ కబ్జాలు పేట్రేగిపోతున్నాయని, ఆస్ట్రేలియాలో ఉంటున్న తమ స్థలాలను కూడా ఆక్రమించుకున్నారని ఎన్‌ఆర్‌ఐ వైద్యురాలు సునీత ఆవేదన చెందారు. తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి, డిప్యూటీ మేయర్ అభినయ రెడ్డి అండదండలతో కంచి రాము కైకాల చెరువులోని తమ స్థలాన్ని కబ్జా చేశారని వీడియో ద్వారా ఆరోపించారు. తమ స్థలం కబ్జాకు గురైందని తెలుసుకుని ఆస్ట్రేలియా నుంచి రెండుసార్లు వచ్చి అధికారులకు ఫిర్యాదు చేసినా న్యాయం జరగలేదన్నారు. హైకోర్టులో వివాదంలో ఉన్న భూమికి తమ అనుమతి లేకుండానే సబ్ డివిజన్ చేసి, దాదాపు రూ.61 కోట్లు టీడీఆర్ బాండ్లు ఎలా ఇస్తారని ఆగ్రహం వ్యక్తం చేశారు. భూ కబ్జాదారుల నుంచి తిరుపతిని కాపాడాలని ఆమె ఈ సందర్భంగా విజ్ఞప్తి చేసిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

ముగిసిన గోవిందరాజస్వామి తెప్పోత్సవాలు




తిరుపతి (కల్చరల్), ఫిబ్రవరి 23: గోవిందరాజస్వామి తెప్పోత్సవాలు శుక్రవారం ముగిశాయి. ఏడు రోజులపాటు జరిగిన ఈ ఉత్సవాల్లో చివరి రోజు సాయంత్రం 6.30 నుంచి రాత్రి 8 గంటల వరకు శ్రీదేవి, భూదేవి సమేత గోవిందరాజస్వామి తెప్పలపై విహరించారు. రాత్రి 8.30 గంటలకు ఆలయ మాడవీధుల్లో ఊరేగించారు. ఉదయం 10.30 నుంచి 11.30 గంటల వరకు ఆలయంలోని కల్యాణ మండపంలో స్వామి, అమ్మవార్లకు పసుపు, పాలు, తేనె, పెరుగు, చందనంతో స్నపన తిరుమంజనం నిర్వహించారు. టీటీడీ హిందూ ధర్మ ప్రచార పరిషత్, అన్నమాచార్య ప్రాజెక్టు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి. ఈ కార్యక్రమంలో తిరుమల పెద్దజీయరు స్వామి, చినజీయరు స్వామి, ఆలయ డిప్యూటీ ఈవో శాంతి, ఏఈవో మునికృష్ణారెడ్డి పాల్గొన్నారు.

రామకృష్ణ ఆశ్రమంలో హోమక్రతువు

నేడు శారదానిలయం ప్రారంభం



తిరుపతి (కల్చరల్), ఫిబ్రవరి 23 : వినాయకనగర్ వద్దనున్న రామకృష్ణ ఆశ్రమ ఆవరణలో నూతనంగా నిర్మించిన శారదా నిలయం (సాధునివాసం) ప్రారంభోత్సవాలు శుక్రవారం మొదలయ్యాయి. రామకృష్ణ మఠం కేంద్ర కార్యాలయం బేలూరు మఠం(కలకత్తా) ఉపాధ్యక్షుడుగౌతమానంద వచ్చారు. ఆయనకు అసిస్టెంట్ జనరల్ సెక్రటరీ స్వామి సత్యేశానంద, తిరుపతి ఆశ్రమ కార్యదర్శి స్వామి సుకృతానంద, స్వామి సత్యస్థానంద పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అంతకుముందు ఉదయం 5 గంటల నుంచి ఆశ్రమ ఆవరణలో పలు హోమాలు, జపాలు, ధ్యానం, భజనలు, ప్రసంగాలు నిర్వహించారు. ప్రముఖ వాగ్గేయకారుడు గరిమెళ్ల బాలకృష్ణప్రసాద్ నిర్వహించిన అన్నమయ్య సంగీత లహరి భక్తులను ఆకట్టుకుంది.

నేడు ప్రారంభోత్సవం

రామకృష్ణ ఆశ్రమంలో నూతనంగా నిర్మించిన శారదా నిలయాన్ని శనివారం ఉదయం 8.20 గంటలకు ప్రారంభించనున్నారు. ఉదయం 6 గంటల నుంచి హోమాలు, భజనలు, ధ్యానం నిర్వహిస్తారు. సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలతో వేడుక ముగుస్తుంది.

రమణ దీక్షితులను విధుల నుంచి బహిష్కరించాలి


సమావేశంలో రమణ దీక్షితులు ఫొటోలు చూపుతున్న టీటీడీ ఉద్యోగులు

తిరుపతి (తిలక్‌రోడ్), ఫిబ్రవరి 23 : శ్రీవారి ఆలయ మాజీ ప్రధాన అర్చకుడు రమణ దీక్షితులను విధుల నుంచి బహిష్కరించి, అతను ఇచ్చిన సిఫారసు లేఖలపై విజిలెన్సు విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని టీటీడీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు చీర్ల కిరణ్ డిమాండ్ చేశారు. శుక్రవారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ శ్రీవారి ఆలయంలో ప్రధాన అర్చకులుగా తాను తప్ప ఎవరూ ఉండకూడదనే ఉద్దేశంతో టీటీడీపై శ్రీవారి ఆలయంలో కైంకర్యాల విషయంలో పొరబాట్లు జరుగుతున్నాయని ఆరోపించడాన్ని తీవ్రంగా ఖండించారు. స్వలాభం కోసం అన్నం పెడుతున్న టీటీడీపై విమర్శలు చేయడాన్ని తప్పుబట్టారు. బెంగళూరు, హైదరాబాదు, మద్రాసు నగరాల్లో విల్లాలు, అపార్ట్‌మెంట్లు, ఆడికార్లు ఎక్కడి నుంచి సంపాదించారో చెప్పాలని ప్రశ్నించారు. గతంలో ఆయన ఇచ్చిన సిఫారసు లేఖలపై, శ్రీవారి ప్రసాదాలపై టీటీడీ విజిలెన్సు విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని, కొండపై అధికారికంగా ఇచ్చిన క్వార్టర్స్‌ను వెనక్కి తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీటీడీ ఉద్యోగ సంఘం నాయకులు పవన్, గోపికుమార్‌రెడ్డి, శివప్రసాద్, సునీల్‌కుమార్, ధరణికుమార్, అంకయ్య, బాలకృష్ణ పాల్గొన్నారు.

వినూత్న ఆలోచన.. సరికొత్త విద్యుత్ వాహనం ఆవిష్కరణ

అన్నమాచార్య ఇంజినీరింగ్ విద్యార్థుల ప్రతిభ



తిరుపతి(విద్య), ఫిబ్రవరి 23 : కరకంబాడి రోడ్డులోని అన్నమాచార్య ఇంజినీరింగ్ కళాశాలలో మెకానికల్ ఇంజినీరింగ్ ఫైనలియర్ విద్యార్థులు తమకు తట్టిన వినూత్న ఆలోచనతో సరికొత్త విద్యుత్ వాహనాన్ని రూపొందించారు. దీనికి పాత ద్విచక్ర వాహనాల, సైకిల్ విభాగాలను ఉపయోగించి పర్యావరణహిత వాహనాన్ని తయారు చేశారు. డబుల్ ఫెడల్ ఆపరేషన్‌తో నడవడం ఈ వాహనం ప్రత్యేకత. ఫెడలింగ్ జరుగుతున్నప్పుడు బ్యాటరీ రీఛార్జ్ అవుతుంది. డైనమోమీటర్ సాయంతో యాంత్రికశక్తిని విద్యుత్ శక్తిగా మార్పు చేసుకుని ఇది పనిచేస్తుంది. నకుల్ స్టీరింగ్ మెకానిజం వాహనాన్ని నియంత్రిస్తుంది. ఈ వాహనానికి స్పీడోమీటర్ బ్యాటరీ రీఛార్జ్ ఇండికేటర్‌ని అమర్చారు. ఈ వాహనం అత్యధిక వేగంతో(50కిమీ/గంట) నడుస్తుంది. బ్యాటరీ రీఛార్జ్ తక్కువైనప్పుడు ఫెడలింగ్ ఆపరేషన్‌తో రీఛార్జ్ చేయవచ్చు. మెకానికల్ విభాగ అధ్యాపకుడు డాక్టర్ ఎం.మారుతీరావు మార్గదర్శకంలో ఐదుగురు విద్యార్థులు ఈ వాహనాన్ని రూపొందించారు. దీని తయారీకి రూ.16వేలు ఖర్చు చేశారు. వికసిత్ భారత్-2047 స్ఫూర్తితో ఈ వాహనం తయారు చేశామని మారుతీరావు అంటున్నారు. విద్యార్థులను, అధ్యాపకుడిని ప్రిన్సిపాల్ డాక్టర్ సి.నాదమునిరెడ్డి, మెకానికల్ హెడ్ ఎం.బాలాజి అభినందించారు.

వెంగమాంబ సంకీర్తనల సీడీ విడుదల



తిరుపతి (కల్చరల్), ఫిబ్రవరి 23 : శ్రీవారి భక్తురాలు తరిగొండ వెంగమాంబ సంకీర్తనల సీడీని శుక్రవారం ఆవిష్కరించారు. శ్వేత సంచాలకులు డాక్టర్ భూమన్, ఎస్వీబీసీ సంచాలకులు, అవధాని, సాయికృష్ణ యాచేంద్ర సీడీని ఆవిష్కరించారు. ఆర్థిక సహకారం అందించిన గుంటూరు జిల్లాకు చెందిన శ్రీరాములు తొలి సీడీని అందుకున్నారు. టీటీడీకి చెందిన శ్రీవేంకటేశ్వర భక్తి ఛానల్ ఇటీవల నిర్వహించిన అదివో అల్లదివో సంగీత పోటీల తుది ఫలితాలను మహతిలో విడుదల చేశారు. విజేతలుగా నిలిచిన యువ గాయకులు పవన్ చరణ్, ఆయి చరణ్, లోకేశ్వర్, హరిణిని బహుమతులతో సత్కరించారు.

తిరుమలేశుని సేవలో వ్యాసరాజ మఠాధిపతి


విద్యాశ్రీష తీర్థ

తిరుమల, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): వ్యాసరాజ మఠాధిపతి విద్యాశ్రీష తీర్థ శుక్రవారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఉదయం నైవేద్య విరామ సమయంలో ఆలయంలోకి వెళ్లిన ఆయన ముందుగా ధ్వజస్తంభానికి మొక్కుకుని తర్వాత గర్భాలయంలోని మూలమూర్తిని దర్శించుకున్నారు. ఆలయాధికారులు ప్రసాదాలు అందజేశారు.

తవ్వేశారు... వదిలేశారు



టౌన్‌క్లబ్ ముందు తవ్విన గుంత

తిరుపతి(కొర్లగుంట), ఫిబ్రవరి 23: భూమిలో విద్యుత్ తీగల ఏర్పాటుకు టౌన్‌క్లబ్ ముందు డివైడర్‌కు ఆనుకుని కాలువ తీశారు. నడి రోడ్డుపై వారం రోజులుగా దాన్ని అలాగే వదిలేయడంతో వాహన చోదకులకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రాత్రివేళ గుర్తించలేక వాహనదారులు అదుపుతప్పి ప్రమాదాలకు గురవుతున్నారు. అధికారులు వెంటనే దీనిపై దృష్టి సారించాలని స్థానికులు కోరుతున్నారు.

తిరుపతి ఆవిర్భావ దినోత్సవం.. నగరంలో ట్రాఫిక్ మళ్లింపులు

తిరుపతి(నేరవిభాగం), ఫిబ్రవరి 23: తిరుపతి ఆవిర్భావ దినోత్సవ ఊరేగింపు సందర్భంగా శనివారం నగరంలో ట్రాఫిక్ మళ్లింపులు ఉంటాయని, వాహనదారులు ప్రత్యామ్నాయ మార్గాల్లో ప్రయాణించాలని తిరుపతి ట్రాఫిక్ పోలీసులు విజ్ఞప్తి చేశారు. ఉదయం 7 గంటలకు గోవిందరాజస్వామి ఆలయం సమీపంలోని జి-కార్ స్ట్రీట్ నుంచి ప్రారంభమై కర్ణాలవీధి, బేరి వీధి, గాంధీ రోడ్డు మీదుగా నాలుకాళ్ల మండపం వద్ద ముగుస్తుందని తెలిపారు. అందుకే ఉదయం 6 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ట్రాఫిక్ మళ్లింపులు చేసినట్లు చెప్పారు.

- జీకార్ స్ట్రీట్, కర్ణాల వీధి, బేరివీధి, గాంధీ రోడ్డులోకి వాహనాలకు అనుమతిలేదు. ఆయా వీధులకు అనుసంధానంగా ఉన్న అన్ని దారులను ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు పూర్తిగా మూసివేయనున్నారు.
- కృష్ణాపురం ఠాణా, ప్రకాశం రోడ్డు, చిన్నబజారు వీధుల్లోంచి గాంధీ రోడ్డులోకి అనుమతిలేదు.
- తిలక్ రోడ్డు, బండ్లవీధి నుంచి నాలుకాళ్ల మండపం మీదుగా ప్రయాణించే అవకాశం ఉండదు.
- కో ఆపరేటివ్ బ్యాంకు పక్క నుంచి జీకార్ స్ట్రీట్‌లోకి ప్రయాణించేందుకు అనుమతి లేదు. భీమాస్ డీలక్స్ పక్కనున్న రోడ్డు నుంచి జీకార్ స్ట్రీట్‌లోకి వాహనాలకు ప్రవేశం లేకుండా మూసివేయనున్నారు.
- రైల్వేస్టేషన్ నుంచి కర్ణాలవీధిలోకి వాహనాలకు అనుమతిలేదు.

మళ్లింపులు

- టౌన్‌క్లబ్ వద్ద ఎన్టీఆర్ కూడలి నుంచి గాంధీరోడ్డు వైపుగా వాహనాలకు అనుమతి లేదు. ఎన్టీఆర్ కూడలికి వెళ్లే వాహనాలు బాలాజీకాలనీ, అలిపిరి వైపునకు వెళ్లాల్సి ఉంటుంది.
- మున్సిపల్ కార్యాలయం సమీపంలోని సెంట్రల్ పార్క్ కూడలి నుంచి నాలుగుకాళ్ల మండపం వైపునకు వాహనాలు వెళ్లేందుకు అనుమతిలేదు. అటుగా వచ్చిన వాహనాలు ఇందిరా మైదానం, తుడా రోడ్డువైపు వెళ్లాల్సి ఉంటుంది.
- అన్నమయ్య కూడలి నుంచి రాయలచెరువు రోడ్డు, అండర్ బ్రిడ్జి మీదుగా కర్ణాలవీధి వైపునకు అనుమతి లేదు. అన్నమయ్య కూడలికి వచ్చే వాహనాలు లక్ష్మీపురం వైపునకు లేదా ఎమ్మార్‌పల్లి వైపునకు వెళ్లాల్సి ఉంటుంది.

అటవీశాఖ సిబ్బందిపైకి దూసుకెళ్లిన కారు

● కానిస్టేబుల్‌కు, ఫారెస్టు వాచ్‌మాన్‌కు గాయాలు



చికిత్స పొందుతున్న కానిస్టేబుల్ ప్రభాకర రావు

ఏర్పేడు, ఫిబ్రవరి 23:వాహనాలు తనిఖీ చేస్తున్న అటవీశాఖ సిబ్బందిపై ఓ కారు దూసుకెళ్లడంతో ఇద్దరు గాయపడ్డారు. ఆర్ఎస్ఐ వినోద్‌కుమార్ ఈ ఘటనపై ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఏర్పేడు సీఐ శ్రీరామ శ్రీనివాసులు కేసు నమోదు చేశారు. ఎర్రచందనం తరలిపోతోందన్న సమాచారంతో తిరుపతి ఆర్ఎస్ఐ వినోద్‌కుమార్ తన సిబ్బందితో ఏర్పేడు మండలం చింతలపాళెం చెక్‌పోస్టు వద్ద శుక్రవారం తెల్లవారుజామున వాహనాలు తనిఖీ చేస్తున్నారు. టీఎస్ 09 ఈఎస్ 5767 నెంబరు గల కారు తనిఖీలకు సహకరించకుండా వేగంగా చింతలపాళెం టోల్‌ప్లాజా వైపు వెళ్లింది.తప్పించుకుపోయే క్రమంలో అక్కడ తనిఖీ చేస్తున్న మరో టీముపైకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో కానిస్టేబుల్ కేవీ ప్రభాకర రావుకు, ఫారెస్టు వాచ్‌మాన్ సుబ్రహ్మణ్యానికి గాయాలయ్యాయి.వీరిలో ప్రభాకర రావు కరకంబాడి సమీపంలోని అమర ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆయన తలకు బలమైన గాయం కావడంతో సర్జరీ చేసినట్లు సమాచారం.

ఆకట్టుకున్న ఆవిష్కరణలు



విజేతలకు ప్రశంసాపత్రాలను అందించిన డీఈఓ డాక్టర్ వి.శేఖర్

రేణిగుంట, ఫిబ్రవరి23: జిల్లా స్థాయిలో ఈఎండీపీ ఎక్స్‌పో-2024 నూతన ఆవిష్కరణల పోటీలు శుక్రవారం రేణిగుంట జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో ఘనంగా జరిగాయి. జిల్లా స్థాయిలో జరిగిన ఈ పోటీలకు 15 పాఠశాలల విద్యార్థులు విచ్చేశారు. 166 ప్రాజెక్టులు రూపొందించి ప్రదర్శించారు. తడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు రూపొందించిన ఎకోబ్రిక్స్ తయారీ ప్రాజెక్టు రాష్ట్రస్థాయికి ఎంపిక చేసినట్లు డీఈవో శేఖర్ తెలిపారు. మొత్తం ఐదు ప్రాజెక్టులను రాష్ట్రస్థాయికి ఎంపిక చేశారు. విద్యాశాఖ అధికారులు ఇందిరాదేవి, రంగ నాథయ్య, హెచ్‌ఎం విష్ణువర్ధనం, కరుణ, విజేతలు మేఘన, షాలిని పాల్గొన్నారు.

ముక్కంటి సేవలో కోల్‌కతా జస్టిస్

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 23: ముక్కంటి ఆలయాన్ని శుక్రవారం కోల్‌కతా జస్టిస్ వేలుమని కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయ ఈవో నాగేశ్వరరావు వారికి స్వాగతం పలికారు. దర్శనానంతరం గురుదక్షిణామూర్తి సన్నిధిలో వేద పండితులు శేష వస్త్రంతో సత్కరించి ఆశీర్వదించారు.

పుత్తూరు వార్తలు

నిరుపేదలకు గృహ వసతి: మంత్రి రోజా



లబ్ధిదారులతో మంత్రి రోజా

వడమాలపేట, ఫిబ్రవరి 23: అర్హులైన నిరుపేదలందరికీ ఇళ్ల పట్టాలు అందజేసి గృహ వసతి కల్పిస్తున్నామని మంత్రి రోజా చెప్పారు. వడమాలపేట మండలంలోని టీసీ అగ్రహారం 439మందికి ఇళ్ల పట్టాలు శుక్రవారం అందజేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలో నిరుపేదలకు సొంత ఇంటి కలను నెరవేర్చామని చెప్పారు. కార్యక్రమంలో అధికారులు, వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

కృష్ణమందిరంలో పౌర్ణమి పూజలు



పూజలు చేస్తున్న మహిళలు

పుత్తూరు టౌన్, ఫిబ్రవరి 23: పుత్తూరు పట్టణంలోని సదాశివేశ్వరస్వామి ఆలయంలో నెలకొన్న కృష్ణమందిరంలో శుక్రవారం పౌర్ణమి సందర్భంగా విశేష పూజలు నిర్వహించారు. మందిరంలోని కృష్ణభగవానునికి ఉదయం నిత్య పూజా కైంకర్యాలు చేపట్టారు. సాయంత్రం మహిళా భక్తులు విశేష పూజలు చేశారు. స్వామివారికి నారికేలా, నేతి దీప, దూపాలను అందజేశారు. కార్యక్రమంలో కృష్ణమందిర నిర్వాహకులు పాల్గొన్నారు.

కేంద్ర పథకాలను సద్వినియోగం చేసుకోండి



అప్పలాయగుంటలో మాట్లాడుతున్న ప్రసాద రెడ్డి

వడమాలపేట, ఫిబ్రవరి 23: కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు చిలకం ప్రసాదరెడ్డి అన్నారు. ప్రజాపోరు కార్యక్రమంలో భాగంగా మండలంలోని అప్పలాయగుంట, పాదిరేడు, కల్లూరు, వడమాలపేటలో శుక్రవారం కరపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో హరిబాబు, సుబ్రహ్మణ్యంరాజు, జగదీశ్వర్ రాజు, రమేష్‌నాయుడు, మునికృష్ణమ నాయుడు, అరుణ, భవనేశ్వరి, మోహన్, సుబ్బు తదితరులు పాల్గొన్నారు.

ద్వాదశ జ్యోతిర్లింగాల దర్శనం



వడమాలపేట, ఫిబ్రవరి 23: వడమాలపేటలోని ద్వాదశ జ్యోతిర్లింగాల నమూనా ఆలయాన్ని ఓం శక్తి భక్తులు శుక్రవారం దర్శించుకున్నారు. రాజయోగిని రమణి భక్తులకు దైవం, సృష్టి, మానవ సంబంధాలు, కారణ జన్మ దైవత్వం, దేవదేవుల అవతారాల గురించి వివరించారు. మూడు రోజులు పాటు సహజ రాజయోగ అభ్యాసం, శక్తిగీతా జ్ఞానం, దేవిదేవతల దర్శనం కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బ్రహ్మకుమారీలు జయంతి, భారతి, అరుణ, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

గూడూరు

సూళ్లూరుపేట/వెంకటగిరి

26న సీఎం జగన్ రాక

చిత్తూరు కలెక్టరేట్/రామకుప్పం, ఫిబ్రవరి 23: సీఎం జగన్మోహన్‌రెడ్డి కుప్పం నియోజకవర్గ పర్యటన ఖరారైంది. ఆయన ఈనెల 26న జిల్లాకు రానున్నారు. సోమవారం ఉదయం 9.45కు ఆయన రేణిగుంట విమానాశ్రయం నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరి రామకుప్పం మండలం రాజుపేట హెలిప్యాడ్‌కు 10.25కు చేరుకుంటారు. స్థానిక ప్రజాప్రతినిధులతో కాసేపు మాట్లాడాక.. 10.30 గంటలకు పూజాస్థలానికి చేరుకుంటారు. అక్కడ ఎగ్జిబిషన్ స్టాళ్లను సందర్శిస్తారు. హెచ్ఎన్ఎస్ఎస్ నీటిని విడుదల చేస్తూ శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తారు. 11.05కు హెలికాప్టర్‌లో బయలుదేరి శాంతిపురం మండలం గుండుశెట్టిపల్లెకు చేరుకుంటారు. బహిరంగ సభాస్థలం వద్ద ఫొటో ఎగ్జిబిషన్‌లో పాల్గొని కొత్త చెరువుల శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తారు. 11.45 నుంచి మధ్యాహ్నం 1.10 వరకు బహిరంగ సభలో పాల్గొంటారు. అనంతరం హెలిప్యాడ్ వద్ద నాయకులతో మాట్లాడి.. హెలికాప్టర్‌లో రేణిగుంట విమానాశ్రయానికి బయలుదేరతారు.

కనకదుర్గమ్మకు విశేష పూజలు

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 23: ముక్కంటి ఆలయానికి అనుబంధంగా కనకాచలంపై వెలసిన కనకదుర్గమ్మకు శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాహుకాలం సమయంలో అమ్మవారి మూలమూర్తికి వివిధ పూజా ద్రవ్యాలతో విశేషంగా అభిషేకాలు చేశారు.

జనరంజక పాలకుడు జన్నత్‌హుస్సేన్



1985లో నిరాహారదీక్ష శిబిరం వద్ద కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డికి నిమ్మరసం అందిస్తున్న కలెక్టర్ జన్నత్ హుస్సేన్

నెల్లూరు (సాంస్కృతికం), ఫిబ్రవరి 23: కలెక్టర్‌గా జన్నత్‌హుస్సేన్ అందించిన సేవలను ఉమ్మడి నెల్లూరు జిల్లా ప్రజలు గుర్తు చేసుకుంటున్నారు.ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి స్పెషల్ చీఫ్ సెక్రటరీగా పనిచేసిన జన్నత్ హుస్సేన్ అనారోగ్యంతో శుక్రవారం తెల్లవారుజామున సూళ్లూరు పేటలోని స్వగృహంలో కన్నుమూసిన విషయం తెలిసి ఆయనకు అశ్రునివాళులర్పించారు.జన్నత్ హుస్సేన్ పార్థివ శరీరాన్ని హైదరాబాద్‌కు తరలించారు. ఆయన అంత్యక్రియలు పంజగుట్టలో శనివారం జరుగుతాయని కుటుంబీకులు తెలిపారు.కాగా 1985-87మధ్య నెల్లూరు జిల్లా కలెక్టర్‌గా విధులు నిర్వహించిన ఆయన హోదాను పక్కనపెట్టి తన వద్దకు ఎవరు వచ్చినా లేచి నిలబడి అర్జీలు తీసుకునేవారు.ఎప్పటి సమస్యను అప్పుడే పరిష్కరించేవారు.అధికారులను ఓ మిత్రుడిగా ప్రోత్సహించేవారు. నెల్లూరు నగరంలో ఎంతో మంది పేదలకు ఇళ్ల స్థలాలు అందజేశారు. జన్నత్ హుస్సేన్ నగర్, కిసాన్‌నగర్ ఆయన హయాంలోనే ఏర్పాటు చేశారు. పేదలకు గృహ నిర్మాణాలలో నెల్లూరు జిల్లాను ప్రథమ స్థానంలో నిలిపిన ఆయనకు ప్రభుత్వం అవార్డు, నగదు పురస్కారం అందజేయగా ఆ నగదును కూడా హౌసింగ్ శాఖ సిబ్బందికే పంచిపెట్టారు. కొత్తూరులో నిరుద్యోగులకు ఇచ్చిన కోళ్ల ఫారంలో కోళ్లు గంబోరా వ్యాధితో చనిపోయి తీవ్రంగా నష్టపోయారు. కలెక్టర్ హోదాలో జన్నత్ స్వయంగా కోళ్లఫారాలను సందర్శించి నిర్వాహకులకు ధైర్యం చెప్పారు. పేద విద్యార్థులు చదువుకునే సంక్షేమ హాస్టళ్లలో సమస్యలను స్వయంగా పరిశీలించడమేకాక విద్యార్థులకు దుస్తులు పంచేవారు. ఆయన బదిలీ అయినప్పుడు ఏ కలెక్టర్ చేయని విధంగా జిల్లాలోని 46 మండలాలకు వెళ్లి అక్కడి అధికారులను, సిబ్బందిని పలకరించి వీడ్కోలు తీసుకున్న సంఘటనలను పలువురు విశ్రాంత అధికారులు గుర్తు చేసుకుంటున్నారు.

ఎమ్మెల్యే కోటంరెడ్డి సంతాపం

జన్నత్ హుస్సేన్ మరణంపై నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1985లో వీఆర్ కళాశాల విద్యార్థి సంఘం అధ్యక్షుడిగా 13రోజులు నిరాహార దీక్ష చేసినప్పుడు అప్పటి ముఖ్యమంత్రి ఎన్టీఆర్ ఆదేశాల మేరకు జన్నత్‌హుస్సేన్ కలెక్టర్ హోదాలో దీక్షా శిబిరం వద్దకు వచ్చారని గుర్తు చేసుకున్నారు. విద్యార్థుల సమస్యలు పరిష్కరించి, తనకు నిమ్మరసం ఇచ్చి దీక్షను విరమింపచేశారని తెలిపారు. అప్పట్లో డీసీసీబీకి జరిగిన ఎన్నికల్లో గుమస్తా గిరి నుంచి కలెక్టర్ వరకు అన్నీ తానై సమర్థవంతంగా నిర్వహించి రైతుల మన్నలు పొందారన్నారు.

గురురూప కీచకుడు

● ఉపాధ్యాయుడిపై దాడి.. అధికారుల విచారణ



పాఠశాలలో తల్లిదండ్రులతో మాట్లాడుతున్న ఎంఈవోలు

పాలసముద్రం, ఫిబ్రవరి 23: విద్యాబుద్ధులు నేర్పాల్సిన గురువు వక్ర బుద్ధి చూపాడు. ఇతడి లైంగిక వేధింపులపై విద్యార్థినుల ఫిర్యాదుతో తల్లిదండ్రులు ఆగ్రహం చెందారు. అతడిపై దాడిచేసి నిర్బంధించారు. ఈ ఘటన శుక్రవారం పాలసముద్రం మండంలో చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. ఎస్ఆర్ కండ్రిగ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడు శంకర్ విద్యార్థినుల పట్ల వెకిలి చేష్టలు చేస్తుండటంతో వారు విసుగు చెందారు. ఇతడి తీరుపై తల్లిదండ్రులకు చెప్పారు. దీంతో విద్యార్థినుల తల్లిదండ్రులు, వారి బంధువులు కలిసి శుక్రవారం పాఠశాలకు వచ్చి తరగతి గదిలో ఉన్న శంకర్‌పై దాడిచేశారు. సహచర ఉపాధ్యాయులు గుమిగూడి జరిగిన సంఘటనపై ఆరాతీశారు. విద్యార్థినులపై అసభ్యంగా ప్రవర్తిస్తున్నాడంటూ చెప్పారు. ఇకపై ఇలాంటి తప్పు చేయనని, క్షమించాలంటూ ఉపాధ్యాయుడు విద్యార్థుల తల్లిదండ్రులను ప్రాధేయపడ్డాడు. ఈ వ్యవహారాన్ని డీఈవో చంద్రశేఖర్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఆయన ఆదేశాలతో గంగాధరనెల్లూరు ఎంఈవో గుణశేఖర్ రెడ్డి, పాలసముద్రం ఎంఈవో-2 గిరిజ పాఠశాలకు చేరుకుని ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడారు. విద్యార్థినులతోనూ విడివిడిగా సమావేశమయ్యారు. కాగా, చదువులో వెనుకబడి ఉన్న వారిని మందలించడంతో తనపై కక్షకట్టి అభాండాలు వేస్తున్నారని విచారణ అధికారుల ఎదుట ఉపాధ్యాయుడు శంకర్ వాంగ్మూలం ఇచ్చినట్లు తెలిసింది. ఏడాదిగా ఈ పాఠశాలలో ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయుల మధ్య ఆధిపత్యపోరు నడుస్తోంది. ఈ క్రమంలో ఉపాధ్యాయుడు శంకర్‌తోపాటు ప్రధానోపాధ్యాయుడు మనోహర్ నాయుడు తమ పాఠశాలకు అవసరం లేదని, బదిలీ చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు అధికారులకు తెలిపారు. ఈ ఘటనపై తమకు ఫిర్యాదు అందలేదని ఎస్ఐ ప్రసాద్ తెలిపారు.

అతివేగానికి ఇద్దరు విద్యార్థుల బలి

● ఆగి ఉన్న ఆర్టీసీ బస్సును బైక్‌తో వేగంగా ఢీకొట్టారు
● సంఘటనా స్థలంలో ఒకరు, ఆస్పత్రిలో మరొకరి మృతి



సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న సీఐ సుదర్శన్ ప్రసాద్

పూతలపట్టు, ఫిబ్రవరి 23: అతివేగానికి ఇద్దరు విద్యార్థులు బలయ్యారు. ఆగి ఉన్న ఆర్టీసీ బస్సును బైక్‌తో వేగంగా ఢీకొనడంతో సంఘటనా స్థలంలో ఒకరు, ఆస్పత్రిలో మరొకరు మృతి చెందారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. తిరుపతి పల్లెవీధికి చెందిన లేట్ మస్తాన్ కుమార్తె అమ్రీన్ (19) నగరంలోని ఓ ప్రైవేటు కళాశాలలో బీకాం ద్వితీయ సంవత్సరం చదువుతోంది. ఈమె తల్లి కువైట్‌లో ఉంటూ బిడ్డను చదివిస్తోంది. తిరుపతి సమీపంలోని కొత్తపల్లికి చెందిన పెంచలయ్య కుమారుడు పునీత్‌కుమార్ (19) కూడా ఇదే కళాశాలలో బీసీఏ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. పునీత్ తండ్రి కూలిపనులు చేస్తూ చదివిస్తున్నాడు. ఈ ఇద్దరు విద్యార్థులు శుక్రవారం ద్విచక్ర వాహనంపై కాణిపాకానికి బయల్దేరారు. మార్గమధ్యంలో ఉదయం 11 గంటల సమయంలో పూతలపట్టు మండలంలోని పి.కొత్తకోట బస్టాపు వద్ద కుప్పం డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు నుంచి ప్రయాణికులు దిగుతున్నారు. ఆ సమయంలో వీరు వేగంగా వస్తూ బస్సును వెనుక నుంచి బైక్‌తో ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో అమ్రీన్ అక్కడికక్కడే మృతిచెందగా, తీవ్రంగా గాయపడిన పునీత్ కుమార్‌ను 108 సిబ్బంది చికిత్స నిమిత్తం చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ అతను కూడా మృతి చెందాడు. సమాచారం అందుకున్న పూతలపట్టు సీఐ సుదర్శన్ ప్రసాద్ తమ సిబ్బందితో హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యల్లో పాల్గొన్నారు. ప్రమాదం విషయం తెలుసుకున్న బంధువులు, స్నేహితులు చిత్తూరు ప్రభుత్వాస్పత్రి వద్దకు చేరుకుని బోరున విలపించారు. మృతదేహాలకు శనివారం పంచనామా నిర్వహించనున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.




పునీత్ కుమార్, అమ్రీన్ (ఫైల్ ఫొటోలు)

దక్షిణ కాళికాదేవికి ప్రత్యేక పూజలు



శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 23: శ్రీకాళహస్తి మండలం వేడాం గ్రామంలో వెలసిన దక్షిణ కాళికాదేవికి శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం రాహుకాలం సమయంలో అర్చకులు అమ్మవారి మూలమూర్తిని పూజా ద్రవ్యాలతో అభిషేకించారు. అనంతరం నిమ్మకాయలు, పూలమాలతో సుందరంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కలిగించారు. శ్రీకాళహస్తితో పాటు పలు గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. మహిళలు దీపాలు వెలిగించి హారతులు పట్టారు. అలయ నిర్వాహకులు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. మధ్యాహ్నం దాతలు ఆలయంలో భక్తులకు అన్నదానం చేశారు.

వైసీపీ నుంచి టీడీపీలోకి

తొట్టంబేడు, ఫిబ్రవరి 23: వైసీపీ నుంచి టీడీపీలోకి రోజురోజుకూ వలసలు పెరుగుతున్నాయని టీడీపీ శ్రీకాళహస్తి నియోజకవర్గ ఇన్‌చార్జి బొజ్జల సుధీర్‌రెడ్డి అన్నారు. తొట్టంబేడు మండలంలోని పూడి పంచాయతీ సర్పంచ్ మునెమ్మ, నాయకులు వసంతరావు, గణేష్, సిసింద్రి, శ్రీను, రమణయ్య, లలిత, చరణ్‌కుమార్, కృష్ణయ్య, వారితో సుమారు 50మంది టీడీపీలో చేరారు. వారికి సుధీర్‌రెడ్డి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు గాలి మురళినాయుడు, మునిరాజనాయుడు, కన్నలి ప్రతాప్‌రెడ్డి, శేషమనాయుడు, శంకర్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

శివపార్వతుల కల్యాణానికి విచ్చేయండి



శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 23: మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా శివపార్వతుల కల్యాణ వేడుకకు విచ్చేయాలని కైకాల సంఘం పెద్దలు ముక్కంటి ఆలయ ఈవో నాగేశ్వరరావును ఆహ్వానించారు. పట్టణంలోని కైకాల వారి పెళ్లి మండపం వద్ద శివపార్వతుల కల్యాణ వేడుక జరగడం, ఈ కళ్యాణ క్రతువులో కైకాల కులస్తులు అమ్మవారి కుటుంబ సభ్యులుగా వ్యవహరించడం ఆనవాయితీ. ఇందులో భాగంగా త్వరలో జరిగే స్వామి అమ్మవార్ల వివాహ వేడుకకు విచ్చేయాలంటూ ఆహ్వాన పత్రికను అందజేశారు. అంతకుముందు ఈవో నాగేశ్వరరావును కైకాల సంఘం సభ్యులు శేష వస్త్రంతో సత్కరించారు.

చెత్తబుట్టల పంపిణీ



వరదయ్య పాళెం, ఫిబ్రవరి 23: వరదయ్య పాళెం మండలం చిన్న పాండూరు సచివాలయ ఆవరణంలో శుక్రవారం అపోల టైర్ల పరిశ్రమ, రియల్ చారిటబుల్ ట్రస్టు సంయుక్తంగా పర్యావరణ పరిరక్షణలో భాగంగా రాచర్ల పంచాయతీకి చెత్త బుట్టలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ధనశేఖర్, సురేష్, వ్యామ్, భువనేశ్, లారెన్స్, సుబ్రహ్మణ్యం, సర్పంచ్ సుబ్రహ్మణ్యం, ఎంపీటీసీ సామర్ల హరి, ఈవోపీఆర్డీ చిరంజీవి, రాజేశ్వరి, హెచ్‌ఎం రాధారాణి, రమేష్, సురేష్, శంఖునాథం, సచివాలయ సిబ్బంది, డప్పు కళాకారులు, ఈశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సవాలను వైభవంగా నిర్వహించాలి

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 23: మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించాలని ఈవో నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. మార్చి 3 నుంచి జరిగే బ్రహ్మోత్సవాలపై ఆలయ పరిపాలన భవనంలో శుక్రవారం ఆయన ఆలయ ప్రధాన అర్చకులు సంబంధం, కరుణాకర్ గురుకుల్‌తో, ఉప ప్రధాన అర్చకులు ఆలయ వేద పండితులతో సమీక్షా సమావేశం నిర్వహించారు.

అపోలో భూపరిహారం అందించండి

వరదయ్యపాళెం, ఫిబ్రవరి 23: వరదయ్యపాళెం మండలంలోని రాచెర్ల పంచాయతీకి చెందిన భూ బాధితులకు న్యాయం చేయాలని కలెక్టర్ లక్ష్మీశకు శుక్రవారం విన్నవించారు. ఏపీ దేవాంగ కార్పొరేషన్ డైరెక్టర్ బొప్పల తిలక్‌బాబు ఆధ్వర్యంలో భూ బాధితులు కలెక్టర్‌ను కలిసి సమస్యను వివరించారు. పరిశీలించి న్యాయం చేస్తామని కలెక్టర్ హామీఇచ్చారు. దొడ్డి శేఖర్, రాచెర్ల నాయకులు మునస్వామి, గిరిప్రసాద్, శివ పాల్గొన్నారు.

కుక్కల దాడిలో ముగ్గురికి గాయాలు



వరదయ్యపాళెం, ఫిబ్రవరి 23: మండంలోని ఇందిరా నగర్ పంచాయతీలో కుక్కల బెడదతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. ఇందిరా కాలనీ, పద్మావతి పురంలో శుక్రవారం కుక్కల దాడిలో ముగ్గురు గాయపడ్డారు. మునెయ్య, చెంచమ్మ, మీర్జాబీ, మురళికి చెందిన గొర్రె, మేక పిల్లపై దాడిచేసి చంపేశాయి. కుక్కల బారి నుంచి రక్షణ కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.

తిరుపతికి ముగ్గురు న్యాయ సలహాదారులు

రేణిగుంట,ఫిబ్రవరి23: రాష్ట్రంలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో పోలింగ్ సమయంలో తిరుపతి పార్లమెంట్ నియోజకవర్గానికి వి.రాజన్న, డి.దినకర్, ఎం.బాలక్రిష్ణనాయుడులను న్యాయ సలహాదారులగా ఎంపిక చేసినట్లు టీడీపీ లీగల్ సెల్ అధ్యక్షులు వేంకటేశ్వర్లు ప్రకటించారు.

తిరుమలలో పట్టుబడిన కొండ చిలువ



తిరుమల, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): తిరుమలలో శుక్రవారం ఓ భారీ కొండ చిలువ పట్టుబడింది. సేవాసదన్ వెనుకభాగంలోని అడవి నుంచి సుమారు 12 అడుగుల పొడవు కలిగిన కొండ చిలువ జన సంచారంలోకి వచ్చింది. వెంటనే పాములు పట్టే టీటీడీ కాంట్రాక్ట్ ఉద్యోగి భాస్కర్ నాయుడు ఘటనా ప్రాంతా నికి చేరుకుని దాన్ని పట్టుకుని దట్టమైన అడవిలో విడిచిపెట్టారు.

సమస్యల పరిష్కారం ఎక్కడ?

● అధికార పార్టీ ఎంపీటీసీలు నిలదీత
● మండల సమావేశానికి అరకొర సర్పంచుల హాజరు
● పలు శాఖధికారుల డుమ్మా

బుచ్చినాయుడుకండ్రిగ, ఫిబ్రవరి 23: సమస్యలు పరిష్కరించనప్పుడు సమావేశాలు ఎందుకని పలువురు అధికార పార్టీ ఎంపీటీసీలు నిలదీశారు. మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఎంపీపీ సుబ్బలక్ష్మి అధ్యక్షతన మండల సమావేశం నిర్వహించారు. కాటూరు ఎంపీటీసీ రవి మాట్లాడుతూ కాటూరు దళితవాడలో శ్మశానం లేక మృతదేహాలను మాలచెరువు కట్టపై పూడ్చుతున్నామని శ్మశానానికి భూమి కేటాయించాలని ఎనిమిది సమావేశాలలో ఏకరువుపెట్టినా అధికారులు పట్టించుకోలేదని వాపోయారు. శ్మశానానికి భూమి కేటాయించకపోతే తహసీల్దార్, ఎంపీడీవో కార్యాలయాల వద్ద మృతదేహాలను ఖననం చేస్తామని హెచ్చరించారు. దీనిపై ఎంపీడీవో మాట్లాడుతూ సమావేశానికి రెవెన్యూ అధికారులు హాజరు కాలేదని సమస్యను మినిట్స్ పుస్తకంలో నమోదు చేసి సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు. కంచన పుత్తూరు సర్పంచ్, భవానీశంకరాపురం, కల్లివెట్టు పంచాయతీల సర్పంచ్‌లు జగనన్న కాలనీలో విద్యుత్ సౌకర్యం కల్పించాలని కోరారు. 28 మందికి గాను ఏడుగురు సర్పంచ్‌లు మాత్రమే హాజరయ్యారు. వైస్ ఎంపీపీ మునికృష్ణారెడ్డి మాట్లాడుతూ అధికారులు ప్రొటోకాల్ పాటించాలని కోరారు. ఇంటర్, పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు ఆర్టీసీ సర్వీసులు ప్రత్యేకంగా ఏర్పాటు చేయాలని పలువురు కోరారు. ఈ సమావేశానికి తాగు నీరు, రెవెన్యూ, పంచాయత్ రాజ్, పశువైద్య శాఖ, సాంఘిక సంక్షేమ శాఖ, ఎక్సైజ్ శాఖ, ఆర్అండ్‌బీ శాఖాధికారులు హాజరు కాలేదు.

దళితుల భూములకు పట్టాలు ఇవ్వాలి

బుచ్చినాయుడుకండ్రిగ, ఫిబ్రవరి 23: మండలంలోని కుక్కంబాకం రెవెన్యూలో సర్వే నెంబరు 81లో దళితులు సాగు చేస్తున్న భూములకు పట్టాలు ఇవ్వాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు దాసరి జనార్దన్ డిమాండ్ చేశారు. శుక్రవారం కుక్కంబాకం గ్రామంలో దళితులు స్వాధీనంలో ఉన్న భూములను దళితులతో కలసి పరిశీలించారు. రమేష్, నాగరాజు, రమణయ్య, ధనంజయులు, జేకే రమణయ్య, దళితులు పాల్గొన్నారు.

ఏపీఎస్ ఆర్టీసీ వైస్ చైర్మన్‌కు అభినందనలు



వరదయ్యపాళెం, ఫిబ్రవరి 23: ఏపీఎస్ ఆర్టీసీ వైస్ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన మిద్దెల హరిని శ్రీకాళహస్తిలోని ఆయన స్వగృహంలో వరదయ్యపాళెంకు చెందిన పలువురు నాయకులు కలిసి శుక్రవారం అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సామర్ల హరి, గుత్తి త్యాగరాజు, మచ్చా తులసీరామ్, దొడ్డి శేఖర్, సుధాకర్, లోకయ్య తదితరులు ఉన్నారు.

కుమారధార తీర్థ ముక్కోటికి ఏర్పాట్లు పూర్తి

నేటి మధ్యాహ్నం 12 గంటల వరకే భక్తులకు అనుమతి

తిరుమల, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): తిరుమలలో శనివారం నిర్వహించనున్న కుమారధార తీర్థ ముక్కోటికి టీటీడీ ఏర్పాట్లు పూర్తిచేసింది. ఉదయ 5.30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు మాత్రమే భక్తులను అనుమతించనున్నారు. అధిక బరువు, ఆస్తమా, గుండె సంబంధిత సమస్యలు, ఇతర దీర్ఘకాలిక వ్యాధులున్న వారు, చిన్నపిల్లలు, వృద్ధులకు అనుమతి లేదని టీటీడీ స్పష్టం చేసింది. గోగర్భం నుంచి పాపవినాశనం వరకు ఆర్టీసీ బస్సుల్లో మాత్రమే భక్తులను అనుమతించనున్నారు. ట్రాఫిక్ దృష్ట్యా ప్రైవేట్ వాహనాల అనుమతిని రద్దు చేశారు. మార్గమధ్యంలో భద్రత, తాగునీరు, ఆహార పదార్థాలను అందుబాటులో ఉంచారు. అత్యవసర పరిస్థితుల్లో భక్తుల కోసం అంబులెన్స్‌లు, డాక్టర్లు, పారామెడికల్ సిబ్బంది, అవసరమైన మందులను అందుబాటులో ఉంచారు. శుక్రవారం తిరుమలలోని కమాండ్ కంట్రోల్ రూమ్‌లో భద్రతా ఏర్పాట్లపై తిరుమల ఏఎస్పీ శివరామరెడ్డి, వీజీవోలు నంద కిశోర్, గిరిధర్, విజిలెన్స్, పోలీసు అధికారులు సమీక్షించారు.

రేపే గ్రూప్-2 పరీక్షలు

● హాజరుకానున్న 27,894మంది అభ్యర్థులు
● 61 కేంద్రాల ఏర్పాటు
● సమాచారం కోసం 9000665565



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ లక్ష్మీశ

తిరుపతి(కలెక్టరేట్), ఫిబ్రవరి 23: జిల్లాలో ఆదివారం గ్రూప్-2 పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ అధికారులను ఆదేశించారు. పరీక్షల ఏర్పాట్లపై శుక్రవారం ఆయన కలెక్టరేట్‌లో సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఉదయం 10.30 నుంచి మధ్యాహం ఒంటి గంట వరకు తిరుపతి, రేణిగుంట, శ్రీకాళహస్తి, పుత్తూరు, కోట, గూడూరు కేంద్రాలుగా పరీక్షలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. 61 సెంటర్లలో 27,894 మంది పరీక్షలకు హాజరుకానున్నారని తెలిపారు. ఇందుకోసం 31మంది జిల్లా అధికారులను రూట్ ఆఫీసర్లుగా, 61మంది తహసీల్దార్లు, ఎంపీడీవోలను లైజన్ ఆఫీసర్లుగా, 61మంది చీఫ్ సూపరింటెండెంట్లుగా నియమించినట్లు వివరించారు. ఉదయం 9.30 గంటలకల్లా అభ్యర్థులు వారికి కేటాయించిన పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు. హాల్ టిక్కెట్‌తో పాటు ఏదైనా గుర్తింపు కార్డు తీసుకురావాలన్నారు. సెల్‌ఫోన్స్, ఎలక్ట్రానిక్ వస్తువులకు అనుమతి లేదన్నారు. పరీక్ష సమయంలో విద్యుత్‌కు అంతరాయం లేకుండా చూడాలని, కేంద్రాల వద్ద తాగునీరు, ఓఆర్ఎస్, మెడికల్ కిట్‌లతో పాటు ఒక ఏఎన్ఎంను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అభ్యర్థులు సమాచారం కోసం 9000665565ను సంప్రదించాలని సూచించారు. ఈ సమావేశంలో డీఆర్వో పెంచలకిషోర్, గ్రూప్-2 పరీక్షల విభాగం అడిషనల్ సెక్రటరీ వెంకటలక్ష్మి, రూట్ ఆఫీసర్లు, తహసీల్దారు, ఎంపీడీవోలు, లైజన్ ఆఫీసర్లు, చీఫ్ సూపరింటెండెంట్లు పాల్గొన్నారు.

శ్రీకాళహస్తి
సత్యవేడు

పిచ్చాటూరు నాయకుల స్వాగతం

పిచ్చాటూరు, ఫిబ్రవరి 23: నారాయణవనం మండలంలో శుక్రవారం జరిగిన 'నిజం గెలవాలి' కార్యక్రమానికి హాజరైన నారా భువనేశ్వరికి పిచ్చాటూరు టీడీపీ నాయకులు ఘన స్వాగతం పలికారు. భువనేశ్వరితో కలసి తుంబూరులో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్నారు.

త్రిశూల స్థానం ఏర్పాట్ల పరిశీలన

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 23: స్వర్ణముఖి నదిలో శనివారం జరగబోయే త్రిశూల స్థానం ఏర్పాట్లను శుక్రవారం ముక్కంటి ఆలయ ఛైర్మన్ అంజూరు శ్రీనివాసులు పరిశీలించారు. ఆలయంలోని మూడవ ద్వారం వద్ద ఇటీవల ఇనుపమెట్లను ఏర్పాటు చేశారు. ముందుగా ఛైర్మన్ అంజూరు శ్రీనివాసులు మెట్ల మార్గాన్ని పరిశీలించారు. అనంతరం స్వర్ణముఖి నదిలో సంజీవముక్తి వ్రతం, త్రిశూల స్నానం జరిగే ప్రదేశంలో ఏర్పాట్లపై ఆరా తీశారు. భక్తులకు అవసరమైన అన్ని సౌకర్యాలను వేగవంతంగా పూర్తిచేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఇంజనీరింగ్ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పశుగ్రాసం విరాళం



శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 23: ముక్కంటి ఆలయ గోశాలకు పట్టణానికి చెందిన పాండురంగయ్య శెట్టి అనేదాత ఒక ట్రక్కు పశుగ్రాసం విరాళంగా ఇచ్చారు. ఈ మేరకు శుక్రవారం భరద్వాజ తీర్థంలోని గోశాల వద్ద ఆలయ ఛైర్మన్ అంజూరు శ్రీనివాసులకు అందజేశారు. ఆలయ అధికారులు దాతలు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అసిస్టెంట్ కమిషనర్ మల్లికార్జున ప్రసాద్, గోశాల ఇంచార్జి సురేష్ రెడ్డి పాల్గొన్నారు.

రోడ్డు పనుల పరిశీలన

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 23: శ్రీకాళహస్తీశ్వరాలయంలోని 4వ గేటు నుంచి భరద్వాజ తీర్థంలోకి వాహనాలు నేరుగా వెళ్లేలా లింక్ రోడ్డు నిర్మాణ పనులు చేపట్టారు. ఈ పనులను ఆలయ ఛైర్మన్ అంజూరు శ్రీనివాసులు శుక్రవారం పరిశీలించారు. బూడిది మిట్ట ప్రజలకు నష్టపరిహారం అందజేస్తామని ఆయన హామీ ఇచ్చారు. ఏఈ వేణుగోపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం ప్రాణదానమే



ప్రశంసా పత్రం అందజేస్తున్న డాక్టర్ వెంకట్రామన్

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 23: రక్తదానం ప్రాణదానంతో సమానమని రోటరీ క్లబ్ కార్యదర్శి డాక్టర్ వెంకట్రామన్ అన్నారు. పట్టణంలోని రోటరీ క్లబ్‌లో శుక్రవారం రెడ్ క్రాస్, ఎన్సీసీ, ఎన్ఎస్ఎస్, రోటరీ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం జరిగింది. రక్తదాతలకు పండ్లు, ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బొజ్జల సుధీర్ రెడ్డి, శ్రీకాళహస్తి ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీలత, అధ్యాపకులు రాజేంద్రుడు, రోటరీ క్లబ్ నిర్వాహకులు చక్రాల ఉష, ప్రమీలమ్మ తదితరులు పాల్గొన్నారు.

అన్నదాతల ఉసురు తీయొద్దు : సీపీఎం



నల్ల చట్టాలపై సీపీఎం నిరసన ర్యాలీ

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 23: దేశానికి అన్నం పెట్టే అన్నదాతల ఉసురు తీయడం మంచిది కాదని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు అంగేరి పుల్లయ్య అన్నారు. ఢిల్లీ, హర్యానా సరిహద్దుల్లో నల్ల చట్టాలను రద్దు చేయాలని ఉద్యమించిన ఓ యువ రైతు పోలీసులు కాల్పుల్లో మరణించడంపై శుక్రవారం సీపీఎం ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ చేపట్టారు. అంబేడ్కర్ సర్కిల్ వద్దకు చేరుకుని మోదీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కేంద్రం మూడు వ్యవసాయ నల్ల చట్టాలను రద్దు చేస్తూ పంటలకు మద్దతు ధర ప్రకటించాలని కోరారు. పట్టణ బాధ్యుడు గంధం మణి, నాయకులు పెనగడం గురవయ్య, వేణు, సంక్రాంతి వెంకటయ్య, వెలివేంద్రం, ఉస్మాన్ బాషా, గురునాథం, రాజా తదితరులు పాల్గొన్నారు.

మసీదు ప్రారంభం

పిచ్చాటూరు, ఫిబ్రవరి 23: మండలంలోని రామాపురంలో నూతనంగా నిర్మించిన మసీదును శుక్రవారం స్థానిక ప్రజాప్రతినిధులతో కలసి ఆ గ్రామానికి చెందిన ముస్లింలు ప్రారంభించారు. వైసీపీ మండల కన్వీనర్ చలపతిరాజు, కేవీ.భాస్కర్‌నాయుడు, సూరిబాబురెడ్డి, సుబ్రహ్మణ్యం, మోహన్ పాల్గొన్నారు.

టీడీపీని గెలిపించుకుంటాం



ఆత్మీయ సమావేశంలో పాల్గొన్న వన్నెకుల క్షత్రియులు

తొట్టంబేడు, ఫిబ్రవరి 23: వచ్చే ఎన్నికల్లో టీడీపీని గెలిపించు కుంటామని వన్నెకుల క్షత్రియులు పేర్కొన్నారు. శ్రీకాళహస్తి మండలంలోని ఊరందూరు గ్రామంలోని టీడీపీ శ్రీకాళహస్తి నియోజక వర్గ ఇన్‌చార్జి బొజ్జల సుధీర్‌రెడ్డి స్వగృహంలో శుక్రవారం వన్నెకుల క్షత్రియుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. శ్రీకాళహస్తి, ఏర్పేడు, రేణిగుంట మండలాలకు చెందిన వన్నెకుల క్షత్రియులు పాల్గొన్నారు. సుధీర్‌రెడ్డికి అండగా ఉంటామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రెడ్డివారి గురవారెడ్డి, పేట బాలాజీరెడ్డి, మిన్నల రవి, వెంకటాచలం, చిన్నారెడ్డి, నాగరాజు, ఎమ్ఎస్‌రెడ్డి, వెంకటరమణ, ప్రతాప్‌రెడ్డి పాల్గొన్నారు.

నారా భువనేశ్వరికి సాదర వీడ్కోలు





వీడ్కోలు పలుకుతన్న ఏర్పేడు నాయకులు, మెమెంటోను అందిస్తున్న హేమంత్ రాయల్

ఏర్పేడు/ రేణిగుంట, ఫిబ్రవరి 23: టీడీపీ అధినేత చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరిని ఏర్పేడు మండల నాయకులు శుక్రవారం సాయంత్రం కలిశారు. చిత్తూరు జిల్లా పర్యటన ముగించుకుని ఆమె హైదరాబాద్‌కు బయలు దేరారు. ఈ సందర్భంగా రేణిగుంట విమానాశ్రయానికి చేరుకున్న ఆమెను టీడీపీ నాయకులు కలిశారు. గుడిమల్లం పరశురామేశ్వరి స్వామి తీర్థ ప్రసాదాలను మాజీ ఛైర్మన్ గిరినాయుడు అందజేశారు. మాజీ జడ్పీటీసీ పేరం ధనంజయులు నాయుడు, సూరినాయుడు, చిరంజీవి నాయుడు పాల్గొన్నారు.

● టీఎన్ఎస్ఎఫ్ నాయకుడు కె.హేమంత్ రాయల్ భువనేశ్వరికి శ్రీవారి చిత్రపటాన్ని అందజేశారు. వీడ్కోలు పలికిన వారిలో శ్రీకాళహస్తి నియోజక వర్గం ఇన్‌చార్జ్ బొజ్జల సుధీర్‌రెడ్డి, వెంకటేష్ యాదవ్, సాయిపవన్ తదితరులు ఉన్నారు.

స్థానికులకే సత్యవేడు టికెట్ ఇవ్వాలి : చెల్లాదురై



సమావేశంలో మాట్లాడుతున్న చెల్లాదురై

సత్యవేడు, ఫిబ్రవరి 23: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో సత్యవేడు కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే టికెట్‌ని స్థానికుడైన తనకు ఇవ్వాలని ఆ పార్టీ నియోజకవర్గ నాయకుడు శికామణి చెల్లాదురై కోరారు. శుక్రవారం ఆయన పలువురు కాంగ్రెస్ నేతలతో సత్యవేడు ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. 2014, 19 ఎన్నికల్లో టిక్కెట్ ఆశించినా దక్కలేదన్నారు. అయినా అధిష్టానం ఆదేశాల మేరకు పార్టీకోసం పనిచేశానన్నారు. ఈసారైనా తనకు ఎమ్మెల్యే టిక్కెట్ ఇవ్వాని కోరారు. వైఎస్ షర్మిల రాకతో కాంగ్రెస్ పార్టీ బలోపేతం కావడం తథ్యమన్నారు. ఈ సమావేశంలో నాయకులు రాజీవ్, సీనియర్ శ్రీరామచంద్రారెడ్డి, రఘునాథరెడ్డి, మాణిక్యం, మస్తాన్ బాషా, కర్ణ, అంబేడ్కర్, ఆశీర్వాదం తదితరులు పాల్గొన్నారు.

తుంబూరు జనహోరు..

నారా భువనేశ్వరికి అపూర్వ స్వాగతం పలికిన టీడీపీ నాయకులు, కార్యకర్తలు



నాయకులకు, కార్యకర్తలకు అభివాదం చేస్తున్న నారా భువనేశ్వరి

సత్యవేడు/నారాయణవనం, ఫిబ్రవరి 23: నారాయణవనం మండలం తుంబూరుకు 'నిజం గెలవాలి2 కార్యక్రమానికి విచ్చేసిన భువనేశ్వరికి టీడీపీ కార్యకర్తలు, ప్రజలు, గ్రామస్తుల నుంచి అపూర్వ స్వాగతం లభించింది. పుత్తూరు బైపాస్ వద్ద భువనేశ్వరి రాకకోసం వేచి ఉన్న సత్యవేడు నియోజకవర్గం నేతలను చూసిన భువనేశ్వరి కారును ఆపి దిగి, అందరితో ఆప్యాయంగా పలకరించి, అభివాదం చేశారు. ఈ సందర్భంగా టీడీపీ నేతలు ఆమెను గజమాలతో సత్కరించి, మంగళ హారతులు పట్టారు. అనంతరం అక్కడ నుంచి తుంబూరుకు చేరుకున్న ఆమెను గ్రామంలో జనం నీరాజనాలు పలికారు. ఆమెతో మాట్లాడాలని, కరచాలనం చేయాలని పార్టీ అభిమానులు, మహిళలు ఎగబడ్డారు. ఆమె అందరితో నవ్వుతూ పలకరించారు. ఓ దశలో జనాలను అదుపు చేయడం భద్రతా సిబ్బందికి కష్టతరంగా మారింది. కాగా నియోజకవర్గ వ్యాప్తంగా ఏడు మండలాల నుంచి వచ్చిన ఆ పార్టీ కార్యకర్తలు, నాయకులు, మండల ప్రజలతో తుంబూరు జన సంద్రాన్ని తలపించింది. జిల్లా స్థాయి నాయకులతో పాటు గిరి, భాస్కరన్, గోవింద స్వామి, మునస్వామియాదవ్, రామాం జులనాయుడు, వరలక్ష్మి యాదవ్, శ్రీనివాస యాదవ్, ఇళంగోవన్‌రెడ్డి, ప్రవీణ్‌కుమార్ రెడ్డి, బాషా, పరుచూరి శివకుమార్, యుగంధర్‌రెడ్డి, సుధాకర్‌నాయుడు, కన్నయ్యనాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఓపిగ్గా వేచిఉన్న ప్రజలు

షెడ్యూల్ ప్రకారం భువనేశ్వరి మధ్యాహ్నం 1.15 గంటలకు చేరుకోవాల్సి ఉన్నప్పటికీ 3.20 గంటలకు చేరుకున్నారు. భువనేశ్వరి రాక కోసం గ్రామస్తులు ఉదయం 11 గంటల నుంచే ఆమెను చూడాలని వేచి చూశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఓపిగ్గా వేచి ఉండి ఆమెతో పలకరించి, కరచాలనం చేసుకుని మురిసిపోయారు.

ఐదుగురితోనే బందోస్తు

భువనేశ్వరి పర్యటనలో పోలీసుల బందోబస్తు నామమాత్రంగా కనిపించింది. ఒక ఏఎస్సై, ఒక హెడ్ కానిస్టేబుల్, ముగ్గురు కానిస్టేబుళ్లతోనే పోలీసు అధికారులు బందోబస్తు ఏర్పాటు చేయడం గమనార్హం. ఒక వైపు వందలాది ప్రజలు, మాజీ ప్రజా ప్రతినిధులు, ఒక ప్రతిపక్ష నేత, మాజీ సీఎం భార్య పర్యటిస్తున్న సమయంలో తగినంత బందోబస్తు ఏర్పాటుచేయక పోవడంపై విమర్శలు చెలరేగుతున్నాయి.

చేతికి ఆపరేషన్ జరిగినా వచ్చిన హేమలత



మునివేలు ఇంట్లో హేమలత

మాజీ ఎమ్మెల్యే హేమలత చేతికి శస్త్ర జరిగినా కూడా లెక్క చేయకుండా కార్యక్రమానికి హాజరు కావడం విశేషం. హేమలతకు వారం రోజుల క్రితం కుడి చేతికి శస్త్ర చికిత్స జరిగింది. చెన్నైలోని ఆమె ఇంటిలో మెట్లపై నుంచి జారిపడి కుడిచేయి ఫ్రాక్చర్ అయిన విషయం తెలిసిందే. అపోలో ఆస్పత్రిలో చేయికి ఆపరేషన్ చేసుకుని రెండు రోజుల క్రితమే ఆమె డిశ్చార్జ్ అయ్యారు. ఓ వైపు నొప్పి బాధిస్తున్నా కూడా ఆమె కార్యక్రమానికి హాజరు కావడం గమనార్హం.

అభివృద్ధిని చూసి ఆదరించండి

తొట్టంబేడు, ఫిబ్రవరి 23: శ్రీకాళహస్తి నియోజక వర్గంలో టీడీపీ చేసిన అభివృద్ధిని చూసి ఆదరించండని ఆ పార్టీ నాయకురాలు బొజ్జల రిషితారెడ్డి కోరారు. శ్రీకాళహస్తి మండలంలోని ఎంపేడు, సూరావారిపల్లి గ్రామాయామె ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు కామేష్ యాద వ్, జడ్పీటీసీలు వెంకటసుబ్బారెడ్డి, తిరుమలయ్య, నాయకులు తాటిపర్తి రవీంద్ర నాథ్‌రెడ్డి, రంగినేని చంచయ్యనాయుడు, తాటిపర్తి ఈశ్వర్‌రెడ్డి, పాపిరెడ్డి, బత్తిరెడ్డి, సుబ్బురాయల్, రఘునాథరెడ్డి, మునిరత్నం, హరి పాల్గొన్నారు.

మందకృష్ణ పర్యటనను విజయవంతం చేయండి

వరదయ్యపాళెం, ఫిబ్రవరి 23: ఈ నెల 27న మందకృష్ణ మాదిగ తిరుపతి పర్యటనను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాఘవయ్య, మండల అధ్యక్షుడు దొరబాబు కోరారు.

సిపాయి భరోసా పంపిణీ

ఏర్పేడు, ఫిబ్రవరి 23: ఏర్పేడు మండలం పల్లంపేట దళితవాడకు చెందిన దాసరి నాగమణి వారం రోజుల క్రితం అనారోగ్యంతో మృతిచెందింది. ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రహ్మణ్యం శుక్రవారం నాగమణి కుటుంబ సభ్యులను పరామర్శించారు. సిపాయి భరోసా కింద 50 రకాల నిత్యావసర సరుకులను అందించారు. వైసీపీ నాయకులు డాక్టర్ వెంకటాద్రి, వెంకీ పాల్గొన్నారు.

లెక్కాజమ లేని ముక్కంటి ఆలయ నిధులు: సుధీర్



సమావేశంలో మాట్లాడుతున్న బొజ్జల సుధీర్‌రెడ్డి

తొట్టంబేడు, ఫిబ్రవరి 23: ముక్కంటి ఆలయ అభివృద్ధిపై శ్వేతపత్రం విడుదల చేయాలని శ్రీకాళహస్తి నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి బొజ్జల సుధీర్‌రెడ్డి కోరారు. ఊరందూరులోని స్వగృహంలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 2019లో ఉన్న ఆలయ నిధులు, వైసీపీ అధికారంలోకి వచ్చాక ఖర్చుచేసిన వివరాలు వెల్లడించాలన్నారు. గత మహాశివరాత్రి సమయంలో మాడ వీధుల్లో రోడ్లను ధ్వంసం చేసి భూగర్భ విద్యుత్ పనులు, ఇప్పుడు మళ్లీ రోడ్లను ధ్వంసం చేసి లైటింగ్ పోల్స్ ఎవరి లబ్ధి కోసం చేస్తున్నారో చెప్పాలన్నారు. ఊరందూరులోని పురాతన శివాలయంలో బంగారు గంటలను ఎందుకు తీసుకెళ్లారని ప్రశ్నించారు. శివం టు శివం రోడ్డు పనులకు అత్యవసరంగా టెండర్లు పిలవాల్సిన అవసరం ఏమిటన్నారు. గతంలో రూ.18 కోట్లు ఉన్న టెండర్ విలువ ఇప్పుడు రూ.29కోట్లకు వేయడం వెనుక మర్మమేమిటో చెప్పాలన్నారు. శ్రీకాళహస్తీశ్వర స్వామివారి ఆలయం వద్ద దగ్గర దేవాంగుల మండపానికి అడ్డంగా ఉందని గాంధీ విగ్రహాన్ని తొలగించడం తగదన్నారు. రాజీవ్‌నగర్ కాలనీలో జరుగు తున్న అక్రమ కట్టడాలను అధికారులు అడ్డుకోకపోవడంలో అతర్యమేమిటని ప్రశ్నించారు. ఖాళీ స్థలాలతో పాటు, కాలువలు, చెరువులు, ఆక్రమించుకొని పేదలకు విక్రయిస్తూ ఎమ్మెల్యే అనుచరులు కోట్లు కొల్లగొడుతున్నారని విమ ర్శించారు. టీడీపీ అధికారంలోకి రాగానే అక్రమ కట్టడాలను కూల్చివేస్తామన్నారు.

ఏర్పేడు: కందాడు పంచాయతీలో బొజ్జల సుధీర్‌రెడ్డి ప్రచారం చేశారు. మన్నసముద్రం మాజీ సర్పంచ్ లక్ష్మమ్మ భర్త, వైసీపీ సీనియర్ నాయకుడు వెంకటముని శుక్రవారం టీడీపీలో చేరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, గురవారెడ్డి, అంకయ్య, పొన్నారావు, ధనంజయులు నాయుడు, గురవారెడ్డి, నాగరాజునాయుడు, సుబ్రహ్మణ్యం, జయప్రకాష్, మాధవయ్య, మనోహర్‌నాయుడు, గిరినాయుడు, అంకయ్య, అశ్వద్ధామ తదితరులు పాల్గొన్నారు.

నా కుమార్తెకు సత్యవేడు టిక్కెట్ ఆశిస్తున్నా : చింతామోహన్



అంబాకం గ్రామంలో పర్యటిస్తున్న చింతామోహన్

వరదయ్యపాళెం, ఫిబ్రవరి 23: తన కుమార్తెకు కాంగ్రెస్ పార్టీ సత్యవేడు అసెంబ్లీ టిక్కెట్ ఆశిస్తున్నట్లు మాజీ ఎంపీ డాక్టర్ చింతామోహన్ వెల్లడించారు. వరదయ్యపాళెంలో శుక్రవారం ఆయన ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా తన కుమార్తె డాక్టర్ నీనా ఆశావహుల జాబితాలో ఉందన్నారు. అవకాశం వస్తే నియోజకవర్గాన్ని అన్నివిధాలా అభివృద్ధి చేస్తుందని తెలియజేశారు. రాష్ట్రంలో అరాచక పాలన సాగుతోందన్నారు. జర్నలిస్టులపై దాడులను ఆయన ఖండించారు.

సత్యవేడు: కాంగ్రెస్ అధికారంలోకి వస్తే దళితులు తీసుకున్న బ్యాంకు రుణాలు రెండు లక్షల లోపు రుణమాఫీ చేస్తామని మాజీ ఎంపీ చింతామోహన్ పేర్కొన్నారు. అంబాకం గ్రామాల్లో చింతామోహన్ ఆధ్వర్యంలో 'మార్పు కావాలి కాంగ్రెస్ రావాలి' కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ చింతామోహన్ కుమార్తె డాక్టర్ నీనా తదితర నేతలు ఇంటింటికీ వెళ్లి కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పురుషోత్తం, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు తేజావతి తదితరులు పాల్గొన్నారు.

● నాగలాపురం మండలంలోని క్రిష్ణాపురం హరిజనవాడలో మాజీ ఎంపీ చింతామోహన్ ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు డాక్టర్ దామోదరం, సింధూజ, శ్రీనివాసన్, జ్ఞానకన్ను, మారి, డిష్‌బాబు, గోవిందస్వామి, ఆనందరాజ్, అమర్నాథ్ పాల్గొన్నారు.

ఇరువర్గాల ఘర్షణ..

కుటుంబంతో సహా ఆస్పత్రిలో చేరిన జనసేన పట్టణ అధ్యక్షులు

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 23: రెండు పక్క పక్క హోటల్స్ నిర్వాహకుల మధ్య వాగ్వాదం ఘర్షణకు దారితీసింది. ఈ ఘటన శ్రీకాళహస్తిలో శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. జనసేన పట్టణ అధ్యక్షులు తోట గణేష్ కథనం మేరకు... గణేష్ కుటుంబం సన్నిధి వీధిలో హోటల్ నిర్వహిస్తోంది. పక్కనే వైసీపీకి సంబంధించిన వారి హోటల్ ఉంది. ఏదో విషయంలో ఇద్దరి మధ్య తరచూ వాగ్వాదం జరిగేది. ఈ క్రమంలో శుక్రవారం రాత్రి వాగ్వాదం ఘర్షణకు దారితీసింది. ఈ ఘటనలో గణేష్, ఆయన తండ్రి శ్రీనివాసులు, తల్లి కావమ్మ, అక్క సరళ చికిత్స నిమిత్తం శ్రీకాళహస్తి ప్రభుత్వ ఆస్పత్రిలో చేరారు. కాగా అవతలి వర్గం తమపై కూడా దాడి జరిగిందని, తోపులాటలో బంగారు చైను పోయిందని వన్ టౌన్ పోలీసులను ఆశ్రయించారు. కాగా జనసేన నియోజకవర్గం ఇన్‌చార్జి వినుత, ఆమె భర్త చంద్రబాబు ఆస్పత్రిలో గణేష్ కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తోట గణేష్ అక్క సరళ మెడలో బంగారు చైను పోయిందని పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు. ఈ కేసులో రాజకీయ కోణంతో అధికారులు ఏకపక్షంగా చేసే అవకాశం ఉందని అనుమానం వ్యక్తం చేశారు. తమ నాయకుడి కుటుంబానికి అన్యాయం జరిగితే ఊరుకోమని స్పష్టం చేశారు.

శ్రీకాళహస్తిలో ట్రాఫిక్ నరకం

- విద్యుత్ అలంకరణ పేరుతో చతుర్మాడ వీధుల్లో రోడ్డు తవ్వకాలు
- స్తంభించిపోతున్న వాహనాలు

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 23: ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీకాళహస్తిలో ట్రాఫిక్ సమస్య ప్రజలకు నరకాన్ని చూపుతోంది. పాలకులు, అధికారుల అనాలోచిత నిర్ణయాలతో జనానికి తీవ్ర ఇబ్బందులు తప్పడం లేదు. చతుర్మాడా వీధుల్లో విద్యుత్ అలంకరణ పేరుతో యథేచ్ఛగా రోడ్లను తవ్వేస్తుండడంతో జనజీవనం అవస్థలమయంగా మారింది.

అప్పుడలా...

మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా రథోత్సవం రోజున విద్యుత్ తీగలతో ఒక్కరోజు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగేది. ఏడాదిలో రథోత్సవం జరిగిన ఒక్కరోజు అందులోనూ ఒక పూట విద్యుత్ అంతరాయం కలిగేది. ఆ ఒక్కరోజు అంతరాయానికి శాశ్వత పరిష్కారం చూపుతామంటూ మాడ వీధుల్లో భూగర్భ విద్యుత్ వ్యవస్థను ఏర్పాటు చేశారు. ఇందుకోసం గత ఏడాది జనవరిలో భూగర్భ విద్యుత్ పనులకు శ్రీకారం చుట్టారు. 45 రోజుల్లో పూర్తి చేస్తామని ప్రకటించి 10 నెలలపాటు నత్తనడక పనులు సాగించారు. కొన్ని నెలలపాటు రోడ్డును తవ్వకాలు చేసి గుంతలు మయం చేయడంతో వ్యాపారులు, వాహదారులు అల్లాడిపోయారు. భూగర్భ విద్యుత్ వ్యవస్థ కోసం రోడ్డుకు ఇరువైపులా అక్కడక్కడా విద్యుత్ ప్యానెల్ బోర్డులను ఏర్పాటు చేశారు. అసలే ఇరుకుగా ఉన్న మాడవీధుల్లో రోడ్డుకు ఇరువైపులా ప్యానల్ బోర్డులు రావడంతో మరింత వెడల్పు తగ్గిపోయింది. రోడ్డుకిరువైపులా కాలువకు లోపల వరకు వ్యాపారులు తమ వస్తువులు, బోర్డులను ఉంచుకునేవారు. ఇప్పుడు ప్యానల్ బోర్డులు రావడంతో కొందరు వ్యాపారులు దుకాణాలు కనబడక ముందుకు చొరబడక తప్పడం లేదు.

ఇప్పుడిలా..

ఇదిలా ఉండగా ఏడాది ముక్కంటి ఆలయ నిధులతో మాడ వీధుల్లో సాలె పురుగు, పాము, ఏనుగు, నంది ప్రతిమల విద్యుత్ అలంకరణలను నాలుగు మాడ వీధుల్లో ఏర్పాటు చేసే పనులను వారం రోజుల క్రితం ప్రారంభించారు. గత ఏడాది సరిగ్గా శివరాత్రి సమయంలో చతుర్మాడా వీధుల్లో రోడ్లను తవ్వేసిన... అదే స్థానంలో మళ్లీ రోడ్లు ఛిద్రం చేసే పనులను సాగిస్తున్నారు. ట్రాఫిక్ సమస్య తెలిసి కూడా మహాశివరాత్రి ఉత్సవాల సమయంలో రోడ్లను తవ్వేయడంపై స్థానిక ప్రజల నుంచి అభ్యంతరాలు వ్యక్తం అవుతున్నాయి. ఈ విద్యుత్ అలంకరణ స్తంభాలు మాడవీధుల్లో రోడ్డుకు ఇరువైపున ఇంకా ఎంత దూరం ముందుకు వస్తాయో తెలియని పరిస్థితి. ఇంకా రోడ్లు మరింత ఇరుకుగా మారిపోతే ట్రాఫిక్ సమస్య ఎంత తీవ్రంగా మారుతుందో అర్థం కాని పరిస్థితి. అసలు మాడవీధులను విస్తరించాల్సిన అవసరం ఉంది. భవిష్యత్తులో విస్తరించాల్సి వస్తే భూగర్భ విద్యుత్ వ్యవస్థ, విద్యుత్ అలంకరణ స్తంభాలు అన్నీ బూడిదలో పోసిన పన్నీరుగా మారక తప్పదు. దూర దృష్టితో ఆలోచించకుండా కోట్ల రూపాయల నిధులను రోడ్లను తవ్వేందుకు పోసేస్తున్నారని పట్టణ ప్రజలు వాపోతున్నారు. ఇకనైనా శ్రీకాళహస్తిని ట్రాఫిక్ నరకం నుంచి త్వరితగతిని తప్పించాలని జనం గగ్గోలు పెడుతున్నారు.





సూపర్ బజార్ కూడలిలో స్తంభించిన ట్రాఫిక్